తరంగాలు

రిపోర్టర్లు కావలెను

అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.

సంప్రదించండి...

94949 23460

ఎడిటర్ : రద్దం నారరాజు

RNI . TELTEL / 2022 / 83463

జాతీయ దిన పత్రిక

# తరంగాలు

Tharangalu Daily News Paper

ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్

మంగళవారం

13 ఆగష్టు 2024

సంపుటి : 02

సంచిక : 68

పేజీలు : 10

వెల రూ.5.00

Epaper : WWW.tharangalu.comEpa

Published From: Hyderabad,Circulated: Hyderabad,Nalgonda,Khammam,Rangareddy,sangareddy,Warangal,Kurnool,Kadapa,Amaravathi,Krishna



## చెరువు అడుగుల్లో భూములు కొనొద్దు

- గొలుసుకట్టు చెరువులకు రక్షణ
- నాలాల ఆక్రమణల తొలగింపు
- హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరిక

**తరంగాలు–హైదరాబాద్,**
గొలుసుకట్టు చెరువులన్నీ పునరుద్ధరిస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. చెరువులకు నీటిని మళ్లించే నాలాలు పూడుకుపోయాయని, అవకాశవాదం వల్ల గొలుసుకట్టు చెరువులన్నీ మాయమయ్యాయని, చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లో ఎవరూ స్థలాలు కొనుగోలు చేయవద్దని సూచించారు. సోమవారం రంగనాథ్ మీడియాతో

-మిగతా 2 లో





# కొరియాలో సీఎం రేవంత్ బృందం

- ఆటోమోటివ్ దిగ్గజం హ్యుందాయ్ సంస్థతో చర్చలు
- మెగా కారు టెస్టింగ్ సెంటర్ ఏర్పాటుకు సంసిద్ధత
- మోటార్ కంపెనీ ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

**తరంగాలు సియోల్,**
దక్షిణ కొరియాకు చెందిన ప్రఖ్యాత ఆటోమోటివ్ దిగ్గజం హ్యుందాయ్ మెగా కారు టెస్టింగ్ సెంటర్ ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. మోటార్ కంపెనీ ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. మెగా కారు టెస్టింగ్ సెంటర్ ఏర్పాటుకు ఆ సంస్థ సంసిద్ధత వ్యక్తం చేసింది. దీంట్లో ఆటోమేటివ్ టెస్ట్ ట్రాక్ సదుపాయంతో పాటు ఎలక్ట్రికల్ వాహనాలు సహా అత్యాధునిక టెస్ట్ కార్ల తయారీ సదుపాయం ఉండేలా ప్రణాళికలు రచిస్తోంది. హైదరాబాద్‌లో

-మిగతా 2 లో

## సుప్రీంలో కవితకు దక్కని ఊరట



- మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు సుప్రీం నిరాకరణ
- ఈడీ, సీబీఐకి సుప్రీంకోర్టు నోటీసులు జారీ
- విచారణ ఆగస్ట్ 20కి వాయిదా వేసిన దర్మాసనం

**న్యూఢిల్లీ,** సుప్రీంకోర్టులో కవితకు ఊరట దక్కలేదు. ఆమెకు మధ్యతంర బెయిల్ ఇచ్చేందుకు సుప్రీం తిరస్కరించింది. ఆమె బెయిల్ పిటిషన్‌పై సోమవారం విచారణ జరిగింది. కవిత పిటిషన్‌పై సుప్రీంకోర్టు పెద్ద ట్విస్ట్ ఇచ్చింది. ఈడీ,

-మిగతా 2 లో



## దక్షిణ భారత దేశంలోనే పెద్ద బౌద్ధ స్థూపం

- భక్త రామదాసు జన్మస్థలం, పాలేరు రిజర్వాయర్ మూడింటినీ పర్యాటక కేంద్రాలుగా మారుస్తం
- డీపీఆర్ సిద్ధం చేయాలని అధికారులకు డిప్యూటీ సీఎం ఆదేశం
- నేలకొండపల్లిలో మంత్రులు పొంగులేటి, జూపల్లితో కలిసి పర్యటన

**తరంగాలు–ఖమ్మం,**
నేలకొండపల్లిలోని బౌద్ధ స్థూపం ఒకటో శతాబ్దం నాటిదని, 8 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ స్థూపం దక్షిణ భారత దేశంలోనే పెద్దదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం ఆయన మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఎంపీ రఘురామిరెడ్డితో కలిసి బౌద్ధస్థూపాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ బుద్ధిస్ట్ మ్యూజియం ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్టు చెప్పారు. అండర్ గ్రౌండ్లో ఆనాటికి సంబంధించిన శిలలు ఉన్నాయన్నారు. బౌద్ధ స్థూపాన్ని ఇండియాలనే ది బెస్ట్ గా

-మిగతా 2 లో

## పంద్రాగస్ట్ వేడుకలకు గోల్కొండకోట ముస్తాబు

- ఏర్పాట్లను పరిశీలించిన సిఎస్ శాంతికుమారి
- 15న తొలిసారి జెండా ఎగురేయనున్న సిఎం రేవంత్



**తరంగాలు హైదరాబాద్,**
రేవంత్ రెడ్డి పంద్రాగస్టు వేడుకలను గోల్కొండ కోటపైనే ప్రారంభిస్తారు. సీఎం హోదాలో ఆయన తొలిసారి గోల్కొండపై త్రివర్ణ పతాకం ఎగురవేయనున్నారు. అనంతరం అక్కడి నుంచి రాష్ట్ర ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. తెలంగాణ ఆవిర్భావం నుంచి 2023 స్వాతంత్ర్య వేడుకల వరకు మాజీ సీఎం కేసీఆరే గోల్కొండపై జెండా ఎగురవేసేవారు. కాగా.. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తొలిసారి జెండా పండుగను ఘనంగా నిర్వహించేందుకు ఘనంగా ఏర్పాట్లు చేస్తోంది.

-మిగతా 2 లో



## వయనాడ్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలు

**ఇంకా ఆచూకీ లేని 130 మంది జాడ**

**వయనాడ్,**
కనీవినీ ఎరుగని విలయాన్ని చూసిన వయనాడ్‌లో ఇంకా విషాదకర పరిస్థితులు కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటికే 200లకు పైగా మృతదేహాలను గుర్తించగా.. అనేక మంది జాడ ఇంకా లభించలేదు. దీంతో రెండు వారాలుగా రెస్క్యూ ఆపరేషన్

-మిగతా 2 లో

## మెడికో హంతకులను వదిలేది లేదు

- ఎంతటి వారున్నా శిక్షించి తీరుతాం
- అవసరమైతే కేసు సిబిఐకి అప్పగిస్తా
- కుటుంబ సభ్యులను పరామర్శించిన సిఎం మమత



**కోల్‌కతా,**
పశ్చిమ బెంగాల్ లో జూనియర్ మెడికో మర్డర్ పై ఆ రాష్ట్ర సీఎం మమతా బెనర్జీ స్పందించారు. సోమవారం ఉదయం మృతురాలి ఇంటికెళ్లి ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించిన మమత.. కేసును వారం రోజుల్లో పరిష్కరిస్తామని చెప్పారు. ఆగస్టు 18 నాటికి పోలీసులు దర్యాప్తు పూర్తి చేయకపోతే సీబీఐకి అప్పగిస్తామని తెలిపారు. కేసులో ఎంతమంది నిందితులున్నా..వారందరినీ

-మిగతా 2 లో

## కేసీఆర్ సంకల్పంతోనే సీతారామ పూర్తి

- కాంగ్రెస్ 7 నెలల్లోనే ప్రాజెక్ట్ పూర్తి చేసినట్లు బిల్డప్
- మండిపడ్డ మాజీమంత్రి హరీష్ రావు



**తరంగాలు–హైదరాబాద్,**
సీతారామ ఎత్తిపోతల పథకం కేసీఆర్‌కు ఇష్టమైన ప్రాజెక్టు అని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం జిల్లాకు కరవు బాధలు తీర్చాలని సీతారామ ప్రాజెక్టు కోసం సంకల్పం చేసింది కేసీఆర్ అని అన్నారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా దాన్ని నిర్మించాలను కున్నారని చెప్పారు. '8 నెలల్లో సీతారామ ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసిందా? కాంగ్రెస్ నేతలు పరాన్న జీవులుగా

-మిగతా 2 లో

# చెరువు అడుగుల్లో భూములు కొనొద్దు

(మొదటి తరువాయి)

మాట్లాడారు. చెరువుల పరిరక్షణకు అందరితో కలిసి మేథోమదనం చేస్తామని, పార్కు స్థలాలు పరిరక్షించే కాలనీ సంఘాలను సమర్థిస్తామని, పార్కు స్థలాల్లో ఫెన్సింగ్ వేసేందుకు కాలనీ సంఘాలు సహకరిస్తున్నామని, బస్తీ వాసుల మెరుగైన జీవన ప్రమాణాలు పెరగాలని, నందగిరి హిల్స్ సొసైటీతో మాకు ఎలాంటి ఒప్పందం లేదని, చందానగర్‌లో గతేడాది బఫర్ జోన్‌లో నిర్మాణాలకు అనుమతులిచ్చారని, ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేస్తే హైడ్రా చర్యలు తప్పవని రంగనాథ్ హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో మెరుగైన ఫలితాలు చూస్తారని, బఫర్ జోన్, ఎఫ్‌టిఎల్ పరిధిలో నిర్మాణాలు కట్టాలంటే భయపడే స్థితికి తీసుకొస్తామని హెచ్చరించారు. అక్రమంగా అనుమతులు ఇచ్చే అధికారులపై విచారణ చేసి ప్రభుత్వానికి వివరిస్తామన్నారు. జిహెచ్ఎంసి పరిధిలో చెరువులు, కుంటలు అన్నీ కలిపి 400కిపైగా ఉన్నాయని, హైడ్రా చెరువలను ప్రధానంగా తీసుకుందని, ఎన్ఆర్ఎస్‌సి నివేదిక ప్రకారం 44 ఏళ్లలో చాలా చెరువు కనుమరుగు అయ్యాయని, చాలా చెరువులు 60 శాతం, కొన్ని 80 శాతం అక్రమణలకు గురయ్యాయని, దీంతో చెరువుల పరిధిలోని ఆక్రమణలను గుర్తిస్తున్నామని, చెరువల ఆక్రమణలను అడ్డుకోకపోతే హైదరాబాద్ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతోందని రంగనాథ్ పేర్కొన్నారు.

## దక్షిణ భారత దేశంలోనే పెద్ద బౌద్ధ స్థూపం

(మొదటి తరువాయి)

తీర్చిదిద్దుతామని తెలిపారు. అభివృద్ధి కి కావలసిన నిధులు మంజూరు చేస్తామని అన్నారు. ఇందుకోసం డీపీఆర్ సిద్ధం చేయాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. నేలకొండ పల్లికి మరో ప్రత్యేకత ఉందని, భక్తరామదాసు జన్మస్థలమని దానిని మరింత అభివృద్ధి చేస్తామని, కాంగ్రెస్ హయాంలో నిర్మించిన పాలేరు రిజర్వాయర్ కూడా ప్రత్యేకత అని ఈ మూడింటిని అభివృద్ధి చేయడం ద్వారా పర్యాటకులను విశేషంగా ఆకర్షించవచ్చన్నారు. తమ ప్రభుత్వం పర్యాటక రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. ఇప్పటికే అంతర్జాతీయ స్థాయి పర్యటకులను నేలకొండపల్లి ఆకర్షిస్తోందని, ఇంకా ఎక్కువ మంది ఈ కేంద్రాలను సందర్శించేలా వసతులు మెరుగుపరచాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

## పంద్రాగస్ట్ వేడుకలకు గోల్కొండకోట ముస్తాబు

(మొదటి తరువాయి)

ముఖ్యమంత్రి 8 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి ఫలాలు వివరిస్తూనే.. గత బీఆర్ఎస్ సర్కార్ వైఫల్యాలను ఎత్తిచూపుతూ ప్రసంగం సాగనుంది. ముఖ్యమంత్రి సహా, ప్రముఖులు గోల్కొండ కోటకు తరలిరానుండటంతో ఏర్పాట్లను సీఎస్ శాంతకుమారి సోమవారం పరిశీలించారు. అమెరికా పర్యటన ముగించుకుని వచ్చి గోల్కొండలో ఏర్పాట్లను ఆమె పర్యవేక్షించారు. వర్షం కురిస్తే.. వేడుకలకు హాజరయ్యేవారు తడవకుండా వాటర్ ప్రూఫ్ టెంట్లు ఏర్పాటు చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. వీఐపీలు రానున్న నేపథ్యంలో ప్రజలకు అసౌకర్యం కలగకుండా బందోబస్తు, ట్రాఫిక్ ఏర్పాట్లు, పార్కింగ్ పై దృష్టి సారించాలని పోలీసులను ఆమె ఆదేశించారు. కాగా.. ఈ స్వాతంత్ర్య వేడుకల్లో తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఓ వైపు సీఎస్ ఆదేశాలతో అధికారులు పరుగులు పెడుతుంటే.. అదే స్థాయిలో గోల్కొండ కోట ముస్తాబవుతోంది. ఏటా రాష్ట్ర ప్రభుత్వం గోల్కొండలో స్వాతంత్య దినోత్సవాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. జెండా వందనం చేసేందుకు ముఖ్యమంత్రి, మంత్రులు రానున్న నేపథ్యంలో అనేక భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రముఖుల ముందు నిర్వహించే పరేడ్‌కి సంబంధించి రిహార్సల్స్ కూడా జరుగుతున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు, ఈ పరేడ్ స్వాతంత్ర్య వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా నిలవనుంది.

## వయనాడ్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలు

(మొదటి తరువాయి)



కొనసాగుతూనే ఉంది. సుమారు 130 మంది ఆచూకీ ఇంకా లభించలేదని అధికారులు పేర్కొన్నారు. వీరి కోసం చలియార్ నది, పరిసర అటవీ ప్రాంతాల్లో ముమ్మర గాలింపు చేపట్టినట్లు వెల్లడించారు. వయనాడ్‌లో జులై 30న కొండచరియలు విరిగిపడిన ఘటనలో 229 మంది చనిపోయినట్లు రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. వీరిలో 51 మందిని ఇంకా గుర్తించాల్సి ఉందని తెలిపింది. వీరికి సంబంధించిన డీఎన్ఏ నివేదిక ఆగస్టు 13లోగా వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. మరోవైపు దాదాపు 130 మంది ఆచూకీ ఇంకా లభించలేదని ప్రభుత్వం వెల్లడించింది. వీరికోసం గడిచిన రెండు వారాలుగా ముమ్మర గాలింపు కొనసాగుతోంది. ఎన్డీఆర్ఎఫ్, పోలీస్, అగ్నిమాపక, అటవీశాఖలకు చెందిన 190 మంది సభ్యుల బృందం.. వరదలు చోటుచేసుకున్న ప్రాంతాన్ని జల్లెడపడుతున్నాయి. ఇందులో భాగంగా చలియార్ నది, దాని పరివాహక ప్రాంతాలు, సమీప అడవులపై దృష్టిసారించినట్లు ఏడీజీపీ ఎం ఆర్ అజిత్ కుమార్ పేర్కొన్నారు. అన్ని ప్రాంతాలను ఇప్పటికే ఒకసారి గాలించామని, తాజాగా నది, దాని తీర ప్రాంతాలపై దృష్టి పెడుతున్నట్లు చెప్పారు. ఎగువ ప్రాంతం మొత్తం పూర్తికాగా, ప్రస్తుతం దిగువన తమ సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందన్నారు. అయితే, నీటి స్థాయిలు తగ్గడంతో మృతదేహాలు బయటకు వస్తున్నాయని చెప్పారు. భారీ వర్షం కారణంగా సెర్చ్ ఆపరేషన్‌కు అంతరాయం కలుగుతోందన్నాయి. అయితే, సోమవారం చేపట్టిన గాలింపులో పలు శరీర భాగాలు లభ్యమైనట్లు స్థానిక మీడియా వెల్లడించింది.

# కొరియాలో సిఎం రేవంత్ బృందం

(మొదటి తరువాయి)



ఉన్న ఇంజినీరింగ్ కేంద్రాన్ని విస్తరించాలని హ్యుందాయ్ తెలిపింది. భారతీయ వినియోగదారుల కోసం బెంచ్‌మార్క్ ఉత్పత్తులు, సాంకేతికత అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని హ్యుందాయ్ ప్రతినిధులు సీఎం రేవంత్ రెడ్డి బృందానికి తెలిపారు. హ్యుందాయ్ మోటార్ కంపెనీ తన అనుబంధ సంస్థ హెచ్ఎంఐఈ ద్వారా తెలంగాణలో కార్ టెస్టింగ్ సదుపాయం నెలకొల్పేందుకు పెట్టుబడులు పెట్టేందుకు ప్రణాళిక చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పారిశ్రామిక స్నేహపూర్వక విధానాలు, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, ఆటంకాలు లేని అనుమతుల వ్యవస్థతో తెలంగాణలో వ్యాపారం చేసేందుకు హెచ్ఎంఐఈ వంటి అత్యుత్తమ కంపెనీలు ముందుకు వస్తున్నాయన్నారు. ఇది ప్రత్యక్షంగా, పరోక్షంగానూ భారీగా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు దోహదపడుతుందని తెలిపారు. పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా అమెరికాలో పర్యటించిన సీఎం రేవంత్ రెడ్డి బృందం ప్రస్తుతం కొరియాకు చేరుకొని అక్కడ పారిశ్రామికవేత్తలతో వరుస భేటీలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇకపోతే వరంగల్ టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులు పెట్టేందుకు కొరియన్ సంస్థలు ఆసక్తి కనబరుస్తున్నాయి. కొరియా పర్యటనలో భాగంగా బిజినెస్ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి.. వరంగల్ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులు పెట్టాలని కోరారు. టెక్స్‌టైల్ రంగం విస్తృతికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న కార్యాచరణ స్థానిక కంపెనీలతో పాటు ప్రపంచస్థాయి కంపెనీలకు అనుకూలంగా ఉందని సీఎం తెలిపారు. యంగాన్ కార్పొరేషన్, కొరియా ఫెడరేషన్ ఆఫ్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీస్ సహా 25 అగ్రశ్రేణి టెక్స్‌టైల్ కంపెనీల అధినేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. వరంగల్ టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను సీఎం రేవంత్‌రెడ్డి వారికి వివరించారు. సీఎం పిలుపునకు కొరియా టెక్స్‌టైల్ ఫెడరేషన్ సానుకూలంగా స్పందించింది. అంతకముందు కొరియాలోని అతిపెద్ద పారిశ్రామిక వ్యవస్థల్లో ఒకటైన ఎల్.ఎస్.గ్రూపు ఛైర్మన్‌తో సీఎం రేవంత్ సమావేశమయ్యారు. ప్రఖ్యాత ఎల్‌జీ గ్రూపు వ్యవస్థాపకులైన ఎల్.ఎస్. గ్రూపు కుటుంబాన్ని కలవడంతోనే కొరియా పర్యటన ప్రారంభం కావడంపై సీఎం హర్షం తెలిపారు. ఎలక్ట్రిక్ కేబుల్స్, బ్యాటరీల తయారీ, గ్యాస్, ఎనర్జీ తదితర రంగాల్లో పెట్టుబడుల విస్తరణకు ఎల్ఎస్ గ్రూపు ఆసక్తి కనబరుస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన ముగించుకున్నారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు దక్షిణ కొరియాలోని సియోల్ చేరుకున్న ఆయన.. వివిధ సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు.. ఇందులో భాగంగా ఆయన ఎల్ఎస్ (ఎల్‌జీ) గ్రూప్ ఛైర్మన్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలో విద్యుత్ కేబుల్, గ్యాస్, ఇంధన, బ్యాటరీల ఉత్పత్తిలో పెట్టుబడులపై చర్చించారు. త్వరలో తెలంగాణలో పర్యటించేందుకు ఎల్ఎస్ గ్రూప్ బృందం అంగీకరించింది. మరోవైపు కొరియా టెక్స్‌టైల్ పరిశ్రమ సమాఖ్యతో సీఎం రేవంత్‌రెడ్డి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వరంగల్ మెగా టెక్స్‌టైల్ పార్కుకు కొరియా పెట్టుబడులు వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఎనిమిది రోజుల పాటు అమెరికాలో సీఎం జరిపిన పర్యటన విజయవంతమైందని తెలంగాణ ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. సీఎం నిర్వహించిన సమీక్ష సమావేశాల ఫలితంగా.. 19 కంపెనీల ప్రతినిధులు తెలంగాణలో రూ.31,532 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చినట్లు పేర్కొంది. రాష్ట్ర ప్రతినిధి బృందం అమెరికాలో దాదాపు 50కి పైగా వాణిజ్య సంస్థలతో సమావేశమైందని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఫార్మా, లైఫ్ సైన్సెస్, విద్యుత్ వాహనాలు, డేటా సెంటర్లు, ఐటీ, ఎలక్ట్రానిక్ రంగాల్లో పెట్టుబడులు పెట్టే దిశగా పలు సంస్థలు సంసిద్ధత వ్యక్తం చేశాయని తెలిపింది.

# సుప్రీంలో కవితకు దక్కని ఊరట

(మొదటి తరువాయి)



సీబీఐకి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. స్పందన తెలియజేయాలని కేంద్ర ఏజెన్సీలను కోర్టు కోరింది. తదుపరి విచారణను ఆగస్టు 20కి వాయిదా వేసింది. మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు సుప్రీం ధర్మాసనం నిరాకరించింది. ఈ కేసుపై జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ విశ్వనాథ్ ధర్మాసనం విచారణ జరిపింది.సీబీఐ, ఈడీ కేసులలో బెయిల్ ఇవ్వాలని కవిత పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఢిల్లీ హైకోర్టు తీర్పును కవిత సవాల్ చేశారు. మార్చి 15న కవితను ఈడీ అరెస్టు చేయగా.. ఏప్రిల్ 11న సీబీఐ అరెస్ట్ చేసింది. ఇక కవిత తరుపున న్యాయవాది ముకుల్ రోహత్గి వాదనలు వినిపించారు. 5 నెలల నుంచి ఆమె జైల్లో ఉన్నారు. 463 మంది సాక్షులను విచారించామని ధర్మాసనం పేర్కొంది. కాగా ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి తిహార్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బెయిల్‌పై ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటికే కవితకు ట్రయల్ కోర్టు, ఢిల్లీ హై కోర్టు బెయిల్ నిరాకరించాయి. దీంతో ఆమె ఆశలన్నీ సుప్రీంకోర్టు పైనే పెట్టుకున్నారు. ఇవాళ తనకు బెయిల్ వస్తుందని ఆమె భావించినట్టు సమాచారం. తనపై ఈడీ, సీబీఐలు నమోదు చేసిన కేసుల్లో బెయిల్ ఇవ్వాలని కోరుతూ కవిత ఈ నెల 8న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తనకు బెయిల్ ఇవ్వడానికి నిరాకరిస్తూ ఢిల్లీ హైకోర్టు జూలై 1న ఇచ్చిన తీర్పును సవాల్ చేశారు. సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్(క్రిమినల్) దాఖలు చేశారు. అక్కడ కూడా వాయిదా పడింది. ఇక బెయిల్ కోసం మరో వారం పాటు కవిత వేచిచూ?డాల్సిన పరిస్థితి నెలకొంది. అప్పుడైనా బెయిల్ వస్తుందో రాదో వేచిచూడాల్సి ఉంది. ప్రస్తుతం కవిత తీహార్ జైల్లో ఉన్నారు. ఆమెను బయటకు తీసుకొచ్చేందుకు ఆమె కుటుంబం తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలోనే ఆమె సోదరుడు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు ఇటీవలే ఢిల్లీకి వెళ్లారు. ఆ సమయంలో వారిద్దరూ కవితకు బెయిల్ అంశంపై చర్చించారని జోరుగా ప్రచారం సాగింది. ఎన్నో ఆశలు పెట్టుకున్నప్పటికీ కోర్టులో నిరాశే ఎదురవ్వడం గమనార్హం.ఢిల్లీ హైకోర్టులో ఢిల్లీ మద్యం పాలసీ కేసులో దర్యాప్తు సంస్థలు దాఖలు చేసిన చార్జ్‌షీట్‌లో 50 మందిని నిందితులుగా పేర్కొన్నాయని... అందులో కవిత మాత్రమే మహిళ అని ఆమె తరుపు సీనియర్ న్యాయవాదులు గతంలో ఢిల్లీ హైకోర్టులో వాదించారు. మహిళలకు కొన్ని ప్రత్యేక వెసులుబాట్లను చట్టాలు కల్పించాయని తెలిపారు. వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని కవితకు బెయిల్ ఇవ్వాలన్నారు. ఈ నేపథ్యంలో దర్యాప్తు సంస్థల తీరును ఆమె తరుపు న్యాయవాది తప్పుబట్టారు. కవిత విషయంలో దర్యాప్తు సంస్థలు మొదటి నుంచీ చట్టాలను ఉల్లంఘిస్తూనే ఉన్నాయని.. అరెస్టు సమయంలో కనీస నిబంధనలు పాటించలేదని.. మహిళలకు ప్రత్యేక రక్షణలు ఉన్నాయని వాటి కింద కవితకు బెయిల్ ఇవ్వాలని కవిత తరఫున సీనియర్ న్యాయవాదులు వినిపించిన వాదనలను హైకోర్టు పరిగణనలోకి తీసుకోలేదు.

## కెసిఆర్ సంకల్పంతోనే సీతారామ పూర్తి

(మొదటి తరువాయి)

ప్రవర్తిస్తున్నారు. వారి ప్రవర్తనతో ప్రజలు నవ్వుకుంటున్నారు. ఖమ్మం జిల్లాలో మంత్రులు పోటీపడి పర్యటనలు చేస్తున్నారు. మేము ఇచ్చిన ఉద్యోగాలు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిందని చెప్పుకొంటు న్నారు. మేము చేసిన ప్రతి మంచి పని కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని చెప్పుకొంటున్నారు. కేసీఆర్ కాకుండా సీతారామ ప్రాజెక్టును వేరేవారు రూపకల్పన చేసి ఉంటే అంత బాగా ఉండేదా? కాంగ్రెస్ పాలనలో ఖమ్మం జిల్లాకు చుక్క నీరు కూడా ఇవ్వలేదు. కానీ, కేసీఆర్ ఈ జిల్లాలో రెండు పంటలు పండే విధంగా ప్రాజెక్టు రూపకల్పన చేశారు. వందేళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఈ ఆలోచన చేశారు. 8 ప్యాకేజీల్లో 5 భారాస ప్రభుత్వం చేసిందే. మరో 3 ప్యాకేజీల్లో 80 శాతం పనులు మేమే పూర్తి చేశాం‘ అని హరీశ్‌రావు తెలిపారు.

## మెడికో హంతకులను వదిలేది లేదు

(మొదటి తరువాయి)

ఆదివారంలోగా అరెస్ట్ చేస్తామన్నారు. ఈ కేసు విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ప్రతిపక్షాల నుంచి విమర్శలు వస్తున్న నేపథ్యంలో ఆమె పోలీసులకు డెడ్ లైన్ విధించారు. మరో వైపు మెడికో మర్డర్ పై ఆందోళనలు మరింత ఉధృతమవుతున్నాయి. ఖీఉ కర్ హాస్పిటల్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సందీప్ ఘోష్ తన పోస్టుకు రిజైన్ చేశారు. అటు దేశ వ్యాప్తంగా పలు రకాల వైద్య సేవలను నిలిపివేస్తున్నట్లు ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రకటించింది. హాస్పిటల్స్ జూనియర్ డాక్టర్ల భద్రతకు కేంద్రం ప్రోటోకాల్ రిలీజ్ చేయాలని ఫోర్డా డిమాండ్ చేసింది. అటు బాధిత కుటుంబానికి పరిహారం చెల్లించాలని ఫోర్డా స్పష్టం చేసింది.

# ఇళ్ల స్థలాల కేటాయింపులో దగా పడ్డ జర్నలిస్ట్ లు





**-న్యాయం చేయాలంటూ ఎమ్మెల్యే, ఆర్డీఓ కు వినతి**
**-పనిచేసే జర్నలిస్ట్ లకు మెండిచేయి, అనర్హులకు లబ్ధి చేకూరేలా కొందరి పన్నాగం**

తరంగాలు/మిర్యాలగూడ ప్రతినిధి
ఎండకు ఎండి... వానకు తడిచి.. వేళకు తిండితినక... వార్తల సేకరణ కోసం పనిచేసే నిజమైన విలేఖరులు దగాపడుతున్నారు. ఏ ప్రెస్ మీట్ లో, కార్యక్రమం లో కనిపించని, ఎవరో రాసిచ్చిన వార్తలు కాఫీ పేస్ట్ చేస్తూ.... స్వంత పనులు చూసుకునే వారు విలేఖరులుగా చాలామణి అవుతూ... ప్రభుత్వం అందించే ఇళ్ల స్థలాలను పొందే అర్హులుగా, కొందరి స్వార్థం తో గుర్తించబడుతూ ఉన్న దురదృష్టకర పరిస్థితులు మిర్యాలగూడలో నెలకొన్నాయి. తమకు న్యాయం జరగాలంటూ దగా పడిన విలేఖరులు సోమవారం స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్),జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి,ఆర్డీవో జి. శ్రీనివాసరావు, తహసిల్దార్ హరిబాబులకు వినతి పత్రం ఇచ్చి తమ గోడు వెల్లబోసుకున్నారు. మిర్యాలగూడ లో విలేకరులకు ఇండ్ల స్థలాలుకేటాయించేందుకు బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే ప్రయత్నాలు మొదలయ్యాయి. అప్పటి ఎమ్మెల్యే,,అధికారుల సూచన మేరకుఇందిరమ్మ కాలనీ సమీపంలో ప్రభుత్వ భూమి లో కేటాయిస్తామన్నారు. రాళ్లు రప్పలతో వున్న ఆ భూమి ని విలేకరుల వద్ద వసూలు చేసిన సొమ్ములతో దాదాపు 5 లక్షలు వెచ్చించి శుభ్రపరచుకోగా, అప్పుడు సుమారు వందమందికి ఇంటి స్థలాలు కేటాయిస్తామంటూ అభయమిచ్చిన ప్రజా ప్రతినిధి అధికారులు పలు కారణాలతో మొండి చేయి చూపారు. నాటినుండి పోరాటం చేస్తున్న విలేకరులు.తాజాగా ఎన్నికైన కాంగ్రెస్ ఎమ్మెల్యే కు తమకు ఇళ్ల స్థలాలు కేటాయించాలంటూ వినతి చేయగా ఆయన సానుకూలంగా స్పందించారు. అధికారులు సరే అన్నారు. ఇదే అదునుగా సీనియర్ విలేకరుల మంటూ చెప్పుకునే కొందరు వారికి వారే పెద్దరికం ఆపాదించుకొని సొంతంగా కమిటీ ఏర్పాటు చేసుకొని, మిగతా విలేకరులు ఎవరికి సమాచారం ఇవ్వకుండానే తమకు నచ్చిన,వారు మెచ్చిన వారిని లబ్ధిదారుల జాబితాలో చేర్చుతూ కేవలం 40 మందికి లబ్ధి చేకూరేలా, మిగిలిన అర్హత కలిగిన జర్నలిస్టులందరికీ మొండి చేయి చూపిస్తూ రహస్యంగా అధికారులకు లిస్టు అందజేశారు. పైగా దీనికి అందరి ఆమోదం ఉందంటూ ఇటు ఎమ్మెల్యేని, అటు అధికారులను మభ్యపెడుతూ ప్లాట్లు దక్కించుకునేందుకు సిద్ధమయ్యారు. విలేకరుల అర్హతలు నిర్ణయించేది అధికారుల అయినప్పటికీ ఏనాడు వార్త సేకరణకు రాని వారికి, గతంలో ఇళ్ల స్థలాలు పొందిన వారు సైతం తమ కుటుంబ సభ్యుల పేరు పెట్టుకుంటూ కొందరు,కుటుంబసభ్యులు ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్నత స్థితిలో ఉన్న వారిని కూడా ఇళ్ల స్థలాలకు లబ్ధిదారులుగా పేర్కొంటూ కొందరు ఇష్టరాజ్యంగావ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతరు :-** కొద్దిరోజులుగా జర్నలిస్ట్ ల ఇళ్ల స్థలాల కేటాయింపులో వర్గాలుగా విడిపోయారని గుర్తించిన స్థానిక ఎమ్మెల్యే బిఎల్ఆర్. గత శుక్రవారం నాడు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అందరూ సమిష్టిగా కూర్చుని లిస్టు ఇవ్వాలంటూ పేర్కొన్నారు. తమ పంతం నెగ్గించుకోవాలని కొందరు ఎమ్మెల్యే ఆదేశాలను బేఖాతరు చేస్తూ తమకు నచ్చిన వారు,మెచ్చిన వారి పేర్లను లిస్టుగా సిద్ధం చేశారు. పైగా అందరి ఆమోదం ఉన్నట్లు ఎమ్మెల్యేను అధికారులను మభ్యపెడుతూ అడ్డదారిలో ఇళ్ల స్థలాలు చేజిక్కించుకునేందుకు సిద్ధమైనట్లు సమాచారం. ఇదేమి అన్యాయం అని సదరు విలేకరులు పెద్దలుగా చెప్పుకునే సీనియర్ విలేకరులను ప్రశ్నించగా అంతా తమ ఇష్టమంటూ, మీ దిక్కున చోట చెప్పుకోమంటూ పేర్కొనటం గమనార్హం. నల్లగొండ జిల్లా కేంద్రంలో కూడా గతంలో కొందరు విలేకరులు అడ్డదారిలో ప్రభుత్వ భూములు కొట్టేయడంతో మిగిలిన విలేకరులు అంతా ఫిర్యాదులు చేయడంతో వారి నుండి భూములు తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం విధితమే. మిర్యాలగూడ లో కూడా జరుగుతున్న అదే తంతుపై ఉన్నతాధికారులకు, లోకయుక్త కు ఫిర్యాదు చేసేందుకు దగాపడ్డ విలేకరులు అంతా సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, అధికారులు అందరికీ న్యాయం చేయని పక్షంలో ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జంగా లక్ష్మణ్ యాదవ్, పైలం వెంకన్న, బంటు సైదులు, అలుగుబెల్లి వెంకట్, వరకాల సురేష్, జె రాజశేఖర్, రాయంచు నరసింహా, బంటు శ్రీనివాస్, నల్లగంతుల నాగభూషణం, రాంప్రసాద్, ధీరావత్ శ్రీను నాయక్,ద్రైద రవి, లక్ష్మణ్, రవి, నగేష్, సైదులు, కృష్ణ, హజార్ సింగ్, శ్రీనయ్య, భరత్ కుమార్, సైదులు, కె. నరసింహా, వి. నగేష్, పి. శీను, షేక్ యాసిన్ ఫరీద్, జి. సైదులు, ఎన్. శివ, డి. రవి, ప్రశాంత్ యాదవ్, జానీ బాబా, తదితరులు ఉన్నారు.

## ఇర్రి సమ్మయ్యకీ సీఎం రిలీఫ్ ఫండ్ అందచేత



తరంగాలు ,ఆలేరు ఆర్సీ :
యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం లింగరాజుపల్లి గ్రామంలో ఇర్రి సమ్మయ్యకు సీఎం రిలీఫ్ ఫండ్ అందజేయడం జరిగినది. ఇతనికి కొద్ది రోజుల క్రితం కాలు విరగడం జరిగింది. అందుకు లక్ష 20వేలకు ముఖ్యమంత్రి సహాయ నిధికి ధరఖాస్తు పెట్టుకోగా 50 వేలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుమంజూరు కావడం జరిగింది. మంజూరు అయిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును సోమవారం రోజు సమ్మయ్యకీ అందజేయడం జరిగినది.ఈ కార్యక్రమంలో లింగరాజు పల్లి గ్రామ శాఖ అధ్యక్షులు ఎర్ర రాజిరెడ్డి, ఎర్ర సంజీవరెడ్డి, మెట్టు తిరుమల్ రెడ్డి, మేకల మహేష్ రెడ్డి, కావటి మల్లేష్, మేకల సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజి కోసం భూపరిశీలిన చేసిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య





తరంగాలు,ఆలేరు ఆర్సీ :
యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం మల్లాపూర్ గ్రామ రెవెన్యూ పరిధిలో 64 వ సర్వే నెంబర్ లో మెడికల్ కాలేజి కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ అలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య , యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హన్మంత్ జెండగేతో కలసి భూమిని పరిశీలించారు. మెడికల్ కాలేజికి అవసరమయ్యే 20 ఎకరాల భూమిని పరిశీలించారు. వీరితో పాటు ఆర్డీవో, ఎమ్మార్వో, ఇతర అధికారులు, తదితరులు, స్థానికులు ఉన్నారు.

## ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో "హర్ ఘర్ తిరంగా"



తరంగాలు ,ఆలేరు ఆర్సీ :
యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో బీజేవైఎం రాష్ట్ర యువ మోర్చా పిలుపుమేరకు "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమంలో భాగంగా బీజెవైఎం ఆత్మకూరు(ఎం) మండలం అధ్యక్షులు పైళ్ళ ప్రశాంత్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధులైన నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి మరియు మహాత్మా గాంధీ విగ్రహానికి శుభ్రం చేసి వారికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు గజరాజు కాశీనాథ్ కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి బండారి సత్యనారాయణ బీజేవైఎం ప్రధాన కార్యదర్శి లోడి మహేష్ గౌడ్ ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి గజ్జెల్లి మధు బీజేవైఎం కార్యదర్శి వనం మధు బీజేవైఎం అధికార ప్రతినిధి పొన్నగని సూర్య ప్రకాష్ బిజెపి గ్రామ శాఖ అధ్యక్షులు లోడి వెంకటయ్య మండల నాయకులు పరకాల రాంబాబు యాస వెంకటరెడ్డి గడ్డం స్వామి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్ తో ఎద్దు మృతి



తరంగాలు ,ఆలేరు ఆర్సీ :
యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలంలోని చిన్నగూడెం గ్రామ0లో నిమ్మల దశరథకి చెందిన ఎద్దు విద్యుత్ తీగలు తగిలి షాక్ తో మృతి.రైతు ప్రాణాపాయం నుండి తృటిలో తప్పించుకున్నారు అని గ్రామస్తులు అన్నారు .ప్రభుత్వ రైతును ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

# క్యాన్సర్ ను నివారించడమే లక్ష్యం

**-గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్లను వ్యాక్సిన్ ద్వారా నివారించవచ్చు..**
**-ఇండియన్ సొసైటీ ఆఫ్ కాల్పోస్కోపీ అండ్ క్లినికల్ పథాలజీ క్యాన్సర్ నిర్మూలల కోసమే పనిచేస్తుంది..**
**-62 వేల మంది స్త్రీలు గర్భాశయ క్యాన్సర్ ద్వారా ప్రతి సంవత్సరం తనువు చాలిస్తున్నారు**
**-డాక్టర్ జీవనజ్యోతి**




తరంగాలు/మిర్యాలగూడ ప్రతినిధి :
ప్రపంచవ్యాప్తంగా మహిళలు ప్రధానంగా రొమ్ము గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్లతో బాధపడుతున్నారని నల్లగొండ స్త్రీ వ్యాధి వైద్య నిపుణుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఐఎంఏ మిర్యాలగూడ అధ్యక్షురాలు డాక్టర్ జీవన జ్యోతి తెలిపారు. సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని జ్యోతి హాస్పిటల్ లో ఇండియన్ సొసైటీ ఆఫ్ కాల్పోస్కోపి అండ్ క్లినికల్ పథాలజీ అనుబంధ నల్లగొండ గైనకాలజిస్టుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన కాల్పోస్కోపి వర్క్ షాప్ లో ఆమె పాల్గొని మాట్లాడారు గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ స్క్రీనింగ్ ద్వారా వచ్చే జబ్బులు వాటి నివారణపై వర్క్ షాప్ లో అవగాహన కల్పించారు గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్లను వ్యాక్సిన్ ద్వారా నివారించవచ్చని తెలిపారు ప్రపంచవ్యాప్తంగా ఏటా లక్ష ఇరవై రెండు వేల మంది మహిళలు గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారని అందులో 62 వేల మంది తనువు చాలిస్తున్నారని చెప్పారు 2030 నాటికి గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్లను నివారించాలన్న ఆశయంతో ఇండియన్ సొసైటీ ఆఫ్ కాల్పోస్కోపీ అండ్ క్లినికల్ పథాలజీ పనిచేస్తుందన్నారు తొలి దశలో క్యాన్సర్ ను గుర్తించినట్లయితే వ్యాధి బారిన పడిన మహిళలు చికిత్స ద్వార సాధారణ జీవితం గడపవచ్చన్నారు వర్క్ షాప్ లో నల్లగొండ స్త్రీ వ్యాధి వైద్య నిపుణుల సంఘం అధ్యక్షులు డాక్టర్ ఆర్ మంజుల కార్యదర్శి డాక్టర్ రాజేశ్వరి ప్రవీణ్ ఇండియన్ సొసైటీ ఆఫ్ కాల్పోస్కోపీ అండ్ క్లినికల్ పెథాలజీ (ఐ ఎస్ సి సి పి )అధ్యక్షురాలు డాక్టర్ లీల కామినేని మెడికల్ కాలేజ్ హెచ్ ఓ డి డాక్టర్ ప్రసన్న లత జ్యోతి హాస్పిటల్ డాక్టర్ అమూల్య తదితరులు పాల్గొన్నారు.

# హర్ ఘర్ తిరంగా యాత్ర

**-బిజెపి మండల అధ్యక్షుడు గజరాజు కాశీనాథ్ ఆధ్వర్యంలో**



తరంగాలు ,ఆలేరు ఆర్సీ :
యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం సోమవారం రోజున భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు గజరాజు కాశీనాథ్ ఆధ్వర్యంలో బిజెపి రాష్ట్ర పార్టీ ఇచ్చిన పిలుపుమేరకు హర్ ఘర్ తిరంగా యాత్ర కార్యక్రమాన్ని మండల కేంద్రంలో హర్ ఘర్ తిరంగా యాత్రను చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముందుగా మహనీయుల విగ్రహాల శుభ్రతలో భాగంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని శుభ్రం చేయడం జరిగింది. ఈ హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో కిసాన్ మోర్చ జిల్లా కార్యదర్శి బండారి సత్యనారాయణ , బిజేవైఎం మండల పార్టీ అధ్యక్షుడు పైళ్ల ప్రశాంత్, మండల ప్రధాన కార్యదర్శి మహేష్ గౌడ్,బిజేవైఎం మండల అధికార ప్రతినిధి సూర్య, బూత్ అధ్యక్షులు యస వెంకటరెడ్డి, లోడీ వెంకటయ్య, సీనియర్ నాయకులు స్వామి, పరకాల రాంబాబు, వనం మధు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణం తీసిన సెల్ ఫోన్

**-ఖమ్మం కాలువ వద్దులో ఘటన**



**తరంగాలు/ఖమ్మం జిల్లా బ్యూరో ఖమ్మం :** సెల్ ఫోన్ మాట్లాడుతూ ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన ఖమ్మం కాలువ వద్దు లో చోటు చేసుకుంది. కుక్కకు స్నానం చేయించడానికి హీటర్ వైరు ప్లగ్గులో పెట్టి స్విచ్ వెద్దమనే సమయంలో సెల్ ఫోన్ రింగ్అయింది.ఫోన్ మాట్లాడుతూ నీటిలో పెట్టాల్సిన హీటర్ చంకలో పెట్టుకునీ షాక్ కొట్టి దోనెపూడి మహేష్ మృతిచెందాడు. స్థానిక కాల్వ ఒడ్డునున్న హనుమాన్ గుడి సమీపంలో దోనెపూడి మహేశ్ బాబు (40) ఆదివారం రాత్రి ఇంట్లో పెంపుడు కుక్కకు స్నానం చేయించేందుకు వేడినీళ్ల కోసం హీటర్ ఆన్ చేయబోయారు. ఈలోగా ఫోన్ రావడంతో మాట్లాడుతూ.. హీటర్‌ను నీటిలో బదులు చంకలో పెట్టుకుని స్విచ్ ఆన్ చేశారు. దీంతో విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయారు.దీంతో అప్రమత్తమైన భార్య దుర్గాదేవి మహేశ్ బాబును ఆసుపత్రికి తరలించారు. కానీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

# వనమహోత్సవం పైన సమీక్ష





**తరంగాలు ,ఆలేరు ఆర్సీ:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం సోమవారం రోజు ఎంపిడిఓ కార్యాలయంలో వనమాహొత్సవం పైన గ్రామ పంచాయతీ కార్యదర్శులు మరియు ఉపాధి హామీ క్షేత్ర సహాయకులుతో ఎంపీడీఓ రాములు నాయక్ సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సమావేశంలో ఎంపిడిఓ మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో నిర్ధేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని కోరారు. ఇంటింటికి అందచేసిన మొక్కలకు జీయో ట్యాగ్ చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. పంచాయతీ కార్యదర్శులు మరియు ఉపాధి హామీ క్షేత్ర సహయకులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ సమీక్షలో పాల్గొన్న ఎంపిఓ జులూరు పద్మావతి , ఉపాధి హామీ సిబ్బంది ఏపీఓ బోడిగే రమేష్, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ సుంకరి శ్రీనివాస్ ,టెక్నికల్ అసిస్టెంట్లు దంతూరీ శ్రీశైలం, జమాండ్ల యాదిరెడ్డి, జెట్ట నిర్మల, పంచాయతీ కార్యదర్శులు,ఉపాధి హామీ క్షేత్ర సహయకులు పాల్గొన్నారు.

## రేణుక ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య





**తరంగాలు ,ఆలేరు ఆర్సీ :** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం కాచారం గ్రామంలో శ్రీ గౌరీ రేణుక వాసవి బసవ లింగేశ్వర స్వామి కైలాసపురం ఆలయంలో అమ్మవారిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీ నారాయణ కళ్యాణం, నాగులపంచమి,బోనాల పండుగ ముగింపు వేడుకల సందర్భంగా విచ్చేసిన బీర్ల ఐలయ్యని ఆలయ నిర్వాహకులు వంగపల్లి ఆంజనేయ స్వామి శాలువాతో సన్మానం చేశారు.

## మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన మార్నేనీ



**తరంగాలు ప్రతినిధి /వర్ధన్నపేట :** వర్ధన్నపేట మండలం కాదరి గూడెం గ్రామానికి చెందిన రిటైర్ ఆర్ఎస్సై వంగాల చెల్మా రెడ్డి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందగా వారి కుటుంబాన్ని తెలంగాణా రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేనీ రవీందర్ రావు పరామర్శించారు.వీరి వెంట స్థానిక నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

# నిద్రలేచింది మొదలు పనిలో నిమగ్నమవ్వాలి

**-ఏ గ్రామ కార్యదర్శి ఆ గ్రామంలోనే నివాసం ఉండాలి**
**-వ్యవసాయశాఖ ఏఈవోలకూ ఇదే వర్తిస్తుంది**
**-ఖచ్చితంగా వారి పరిధిలోని క్లస్టర్లోనే ఉండి పనిచేయాలి**
**-వచ్చే సోమవారం నాటికి ఇది అమలుకావాలి**
**-వారి పనితీరును ఎప్పటికప్పుడు రిపోర్టు చేయాలి**



**తరంగాలు/ఖమ్మం జిల్లా బ్యూరో ఖమ్మం :** నిద్రలేచింది మొదలు పనిలో నిమ్నగమవ్వాలనీ,ఏ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆ గ్రామంలోనే నివాసం ఉండి పనిచేయాలి అప్పుడే గ్రామంలో నెలకొన్న సమస్యలు స్థానిక స్థితిగతులపై పట్టుకలిగి ఉంటారు పాలేరు నియోజకవర్గ పరిధిలో పనిచేస్తున్న పలు పంచాయతీ కార్యదర్శులపై ఫిర్యాదుల అందాయనీ, మొదటి తప్పుగా మందలించి వదిలేయడం జరుగుతుందనీ, ఇదే పునరావృతం అయితే ఊరుకునేది లేదు వారికి ట్రాన్స్ ఫర్ అనేది ఉండదనీ, శాఖాపరమైన చర్యలకు పూనుకోవాల్సి ఉంటుందని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి గ్రామ కార్యదర్శులను హెచ్చరించారు. వ్యవసాయ శాఖ ఏఈవోలు కూడా వారు పనిచేసే క్లస్టర్ పరిధిలోనే నివాసం ఉండాలని సూచించారు. ఓ గ్రామంలో నివాసం ఉంటూ మరో గ్రామంలో లేదా వేరే మండలం నుంచి ఇంకో మండలంలోని ఏదైనా గ్రామంలో పనిచేసే వారు తక్షణమే వారు పనిచేసే గ్రామాలకు నివాసం వెళ్లాలని ఆదేశించారు. వారం రోజుల్లోగా ఇది అమలు కావాలని డీపీవోకు సూచించారు. ఖమ్మం రూరల్ మండలం సత్యనారాయణపురంలోని టీసీవీ రెడ్డి ఫంక్షన్ హాల్లో ఖరీఫ్ పంటల సాగు, పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత నియోజకవర్గంలోని మేజర్ గ్రామ పంచాయతీలకు చెందిన కార్యదర్శుల నుంచి ఆయా గ్రామాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశ అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ. ప్రతి గ్రామ పంచాయతీల్లో డైనమిక్ గా పనిచేసే కార్యదర్శులను నియమించాలన్నారు.ఖమ్మం రూరల్ మండలం పెద్దతండా లాంటి మేజర్ గ్రామ పంచాయతీల్లో అవసరాన్ని బట్టి మరో పంచాయతీ కార్యదర్శిని కూడా నియమించాలని సూచించారు. రాబోవు ఏడాదిలోపు నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీల సమస్య తీరుతుందనీ,అత్యవసరమైనవి తన దృష్టికి తెస్తే తక్షణమే నిర్మాణం చేపట్టేలా చూస్తానని పేర్కొన్నారు. పలువురు సిబ్బంది కాసులకు కక్కుర్తి పడి పాఠశాలలకు 200మీటర్ల లోపు కూడా మద్యం దుకాణాలకు అనుమతి ఇచ్చారని వాటి వివరాలను సేకరించి వారిపై చర్యలకు ఉపక్రమించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## ముఖ్యమంత్రి పర్యటనకు త్వరతగతిన ఏర్పాట్లు పూర్తి చేయాలి



**తరంగాలు/ఖమ్మం జిల్లా బ్యూరో ఖమ్మం :** ఈనెల 15న ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. సోమవారం కలెక్టర్, వైరాలో చేపట్టనున్న ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం అధికారులతో సమావేశమై పర్యటన రోజున తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన పనుల గురించి అధికారులకు దిశానిర్దేశం చేశారు.అధికారులు, ఏ ఏ స్టాల్స్ పెడుతున్నది, స్టాల్స్ పొడవు ఎంత వెడల్పు ఎంత తీసుకుంటున్నది అడిగి తెలుసుకున్నారు.ఏ ఏ శాఖలచే ఎన్ని స్టాల్స్ ఏర్పాటు చేయాల్సింది అధికారులకు వివరించారు. ప్రతి స్టాల్లో ఫ్లెక్సీ, బ్యానర్స్ ప్లాస్టిక్ రహితంగా ఉండాలన్నారు.శాఖల వారీగా స్టాల్ నెంబర్స్ ఇచ్చి వాటిలో ఎటువంటి పొరపాట్లు రాకుండా చూడాలన్నారు.ఏ స్టాల్స్ లో ఏ తరహా ప్రదర్శిస్తుంది, ఏ విషయానికి సంబంధించినవి ప్రదర్శిస్తున్నది అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య, ఖమ్మం ఆర్డీవో జి. గణేష్, జిల్లా అధికారులు తదితరులు ఉన్నారు.

## విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా పనిచేసే ప్రైవేట్ స్కూల్స్ మీద చర్యలు తీసుకోవాలి

**-ప్రైవేట్ టీచర్స్ పోరం ఖమ్మం జిల్లా అధ్యక్షులు కోరకొప్పు రామారావు**



**తరంగాలు/ఖమ్మం జిల్లా బ్యూరో ఖమ్మం :** విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా పనిచేసే ప్రైవేట్ స్కూల్స్ పైన తక్షణమే చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం జిల్లా అధ్యక్షులు కొరకొప్పు రామారావు డిమాండ్ చేశారు. సోమవారం ఖమ్మం కలెక్టరేట్ లో జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమంలో పాల్గొని, ఖమ్మం జిల్లా వ్యాప్తంగా విద్యాశాఖ నిబంధనలను బలంగా వ్యతిరేకిస్తూ,ప్రతి సెలవు దినాల్లో స్కూల్స్ నడిపే సుమారు 30 ప్రవేట్ స్కూల్స్ పైన జిల్లా కలెక్టర్ కి జిల్లా విద్యాశాఖ అధికారి కి రాతపూర్వక ఫిర్యాదు ఇవ్వడం జరిగింది. విద్యాశాఖ ఆదేశాలను ప్రతి ప్రైవేటు పాఠశాల పాటించాలని పాటించని ప్రైవేట్ స్కూలు పైన యాజమాన్యం పైన కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం నుండి వచ్చే ప్రతి సెలవు దినాన్ని ప్రైవేటు టీచర్స్ కు వర్తింప చేయాలని సెలవు ఇవ్వని ప్రవేట్ స్కూల్ పైన తక్షణమే శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ అధికారులు కోరారు. ఆదివారం, రెండవ శనివారం ఒక్కరోజు సెలవు దినాల్లో స్కూల్స్ నడిపే ప్రైవేట్ స్కూల్స్ మీద తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వము నుండి వచ్చే ప్రతి సెలవు దినాన్ని ప్రైవేటు టీచర్స్ కు వర్తింప చేయాలని ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారులు కోరారు.ఈ కార్యక్రమంలో దామాల సత్యనారాయణ, టి పి టి ఎఫ్ జిల్లా నాయకులు ఇ.సురేష్ ,ఎం శ్రీనివాస్, ఏ సరిత ,ఈ. డేవిడ్ ,ఎం.శ్రీనివాస్, బి వినోద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఖానాపురం హవేలి సిఐ ని కలిసిన కేసీఆర్ టవర్స్ నూతన అభివృద్ధి కమిటీ సభ్యులు



**తరంగాలు/ఖమ్మం జిల్లా బ్యూరో ఖమ్మం :** టేకులపల్లి శుక్రవారం కేసీఆర్ టవర్స్ అభివృద్ధి నిమిత్తం కేసిఆర్ టవర్స్ లో అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. ఇందు నిమిత్తం ఖానాపురం హవేలి సిఐ రడం. భాను ప్రకాష్ ని ఖమ్మం టేకులపల్లి కెసిఆర్ టవర్స్ అభివృద్ధి కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందచేశారు.టేకులపల్లి,కెసిఆర్ టవర్స్ లో నూతనంగా కెసిఆర్ టవర్స్ అభివృద్ధి కమిటీ ఎన్నుకున్నట్లు సిఐ భాను ప్రకాష్ కి తెలియచేశారు.ఈ సందర్భంగా నూతన కమిటీకి సిఐ శుభాకాంక్షలు తెలిపారు. కెసిఆర్ టవర్స్ లో శాంతి భద్రతల పరిరక్షణకు కమిటీ సభ్యులు సహకారించాలని సిఐ భాను ప్రకాష్ కోరారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, కొన్ని బ్లాక్ ల్లో చీకటి కార్యక్రమాలు జరుగుతున్నాయని, అలాంటి కార్యక్రమాలు జరగకుండా రాత్రి వేళల్లో పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలని, గతంలో మాదిరిగా సెక్యూరిటీ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.అందుకు స్పందించిన సిఐ ప్రతి రోజు రాత్రి వేళల్లో పెట్రోలింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు గౌరవ సలహాదారులు రణం సురేష్, విప్లవ కుమార్, ప్రెసిడెంట్ ఎస్.కె మహమ్మద్, సెక్రటరీ శివ సాయి కుమార్, ట్రెజరర్ పాస్టర్ ఆదాం, వైస్ ప్రెసిడెంట్ సాక్షి ఉపేందర్, జాయింట్ సెక్రెటరీ మేడి బోయిన నగేష్ యాదవ్, వల్లూరు విజయ్, మహిళా ప్రెసిడెంట్ &జాయింట్ సెక్రెటరీ షేక్ సమీరా, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ కుంకిమళ్ళ వైకుంఠరావు, వైపి కరుణాకర్, మరి కొంతమంది జాయింట్ సెక్రెట్రీస్, మరి కొంతమంది ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ పాల్గొన్నారు.

తరంగాలు
Tharangalu Daily News Paper
RNI . TELTEL / 2022 / 83463

# బౌద్ధ స్థూపాన్ని ప్రఖ్యాత పర్యాటక కేంద్రంగా మారుద్దాం

**-ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి**

**తరంగాలు/ఖమ్మం జిల్లా బ్యూరో ఖమ్మం:** నేలకొండపల్లి క్రీ.శ. ఒకటో శతాబ్ద కాలానికి చెందిన నేలకొండపల్లి వద్ద గల బౌద్ధ క్షేత్రాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుదామని ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి అన్నారు. సోమవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సీపీ సునీల్ దత్ తో కలిసి బౌద్ధ స్తూపం చుట్టూ తిరిగి.. అక్కడి పరిసరాల్లో కలియతిరిగి పరిశీలించారు. ఆర్కియాలజీ డిప్యూటీ డైరెక్టర్, అధికారుల ద్వారా పూర్తి వివరాలు తెలుసుకున్నారు. పర్యాటకులను, బౌద్ధ భిక్షువులను ఆకట్టుకునేలా అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉందని, అందుకు అనుగుణంగా పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాల్సి ఉందని అన్నారు. ఇక్కడి స్థూపం దక్షిణ భారతదేశంలోనే అతి పెద్దది కావడం విశేషమని, శతాబ్దాల చరిత్ర కలిగిన దీని ఆనవాళ్లు పదిలంగా ఉండేలా పనులకు ప్రణాళిక రూపొందించాలన్నారు. ఈ క్షేత్రం వెంట ఉన్న చెరువులో బోటింగ్ ఏర్పాటు చేసి.. సందర్శకులు, పర్యాటకులను ఆకట్టుకోవచ్చని అన్నారు. ఉప ముఖ్యమంత్రి, ఇద్దరు మంత్రులు, ఎంపీ స్వయంగా ఈ ప్రాంతానికి వచ్చి.. పర్యాటక రంగానికి పెద్దపీట వేస్తామని అభయం ఇవ్వడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.తెలుగు వాగ్గేయకార ఆద్యులు, భద్రాచల శ్రీసీతారామ దేవస్థానం నిర్మించిన భక్త రామదాసు(కంచర్ల గోపన్న) నాలుగు శతాబ్దాల కిందట జీవించిన నేలకొండపల్లిలోని స్వగృహాన్ని, పక్కనే నిర్మాణంలో ఉన్న నూతన ధ్యాన మందిరాన్ని



ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి సందర్శించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు లతో కలిసి అక్కడ ప్రత్యేక పూజలు చేశారు. భక్త రామదాసు వినియోగించిన బావిని స్వయంగా పరిశీలించారు. అప్పటి విశేషాలను అర్చకులు, స్థానికుల ద్వారా తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శాఖమూరి రమేష్, నాయకులు నెల్లూరి భద్రయ్య,కొడాలి గోవిందరావు, కొప్పుల చంద్రశేఖర్ రావు, వెన్నపూసల సీతారాములు, బొడ్డు బొందయ్య, నాగేశ్వరరావు, చిత్తూరి అచ్చయ్య, మామిడి వెంకన్న, వేగినీటి లక్ష్మీ నరసయ్య, బచ్చలకూరి నాగరాజు,మైసా శంకర్, షేక్ మదర్ సాహెబ్, అంజిని, బోయిన వేణు, సీత, కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## దృశ్య శ్రవణ మాధ్యమం ద్వారా పంటలపై రైతులకు అవగాహన

**-ఏఓ సుజాత**



**తరంగాలు ,ఆలేరు ఆర్సీ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం మరియు మోటాకోండుర్ మండలంలలోని రైతు వెదికల నందు నేడు( మంగళవారం) ఉదయం 10 గంటలకు రైతు వేదికల నందు వీడియో కాన్ఫరెన్స్ (దృశ్య శ్రవణ మాధ్యమం) ద్వారా మొక్కజొన్న మరియు చిరుధాన్యాల పంటల యాజమాన్య పద్ధతుల పైన రైతులకు అవగాహన కల్పించబడునని రైతులు అధిక సంఖ్యలో పాల్గొని పంటలకు సంబంధించిన మెలకులు తెలుసుకుని నాణ్యమైన అధిక దిగుబడులతో కూడిన పంటలు పండించడానికీ ఉపయోగకరంగా ఉంటుందని ఉభయ మండలాల ఏఓ సుజాత పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

## పోగొట్టుకున్న సెల్ ఫోన్ అప్పగింత




**తరంగాలు/పాలేరు ఆర్సి:** పాలేరు నియోజకవర్గ పరిధిలోని తల్లంపాడు గ్రామానికి చెందిన కూడా బాలకృష్ణ అను వ్యక్తి తన వివో వి16 గల మొబైల్ ను మూడు నెలల క్రితం పోగొట్టుకున్నాడు. దింతో జూన్ 10 వ తేదీన కూసుమంచి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ ద్వారా పోర్టల్ ద్వారా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి,టేక్ టీం అపరేటర్ పిసీ-3003- తేజావత్ రమేష్ ఎంతో చాకచక్యంగా వ్యవహరించి పోగొట్టుకున్న ఫోన్ ను కనిపెట్టారు.సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ కార్యాలయంలో కూసుమంచి ఏఎస్ఐ కృష్ణ ప్రసాద రావు చేతులమీదిగా పోగొట్టుకున్న సెల్ ఫోన్ ను బాధితుడికి అప్పగించారు. ఈ సందర్భంగా బాధితుడు పోలీసులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశాడు.

## మూడు తండాలో పారిశుద్ధ్యం పనులు చేపట్టాలి



**తరంగాలు న్యూస్- నర్సింహులపేట** నర్సింహులపేట మండల కేంద్రంలోని లోక్య తండా గ్రామపంచాయతీ పరిధిలోని మూడు తండా లో పాశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైందని, సైడ్ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం, నిలువ ఉన్న మురికి నీరు బయటికి పంపించే విధంగా ప్రత్యేక ఏర్పాటు చేయకపోవడంతో దూర్వసన వెదజల్లుతుంది. రెండు నెలలుగా ఇదే పరిస్థితి నెలకొందని , వీధి దీపాలు, వేయాలని దోమల మందు స్ప్రే చేయట్లేదని మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని తండావాసులు ఎంపీ ఓ కిన్నెర యాకయ్యకు తమ సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో విజయ్ కుమార్, రామోజీ, సూక్య, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీ కి చిక్కిన ఇరిగేషన్ ఏఈ



**తరంగాలు ప్రతినిధి /వరంగల్ :** హనుమకొండలోని నక్కలగుట్ట ఎస్బిఐ బ్యాంకు ప్రాంతంలో రూ 6వేలు లంచం తీసుకుంటుండగా ఇరిగేషన్ ఏఈ గూగులోత్ గోపాల్ ఏసీబీకి పట్టుబడ్డాడు. పాలకుర్తి మండలం గుడికుంటతండా గ్రామ మాజీ ఎంపీటీసీ భానోత్ యాకుబ్ గతంలో చేసిన పనులకు బిల్లు క్లియరెన్స్ కోసం ఇరిగేషన్ ఏ ఈ గోపాల్ రూ 10వేలు డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఏసీబీకి ఫిర్యాదు చేయడంతో.. పక్క ప్లాన్ ప్రకారం రూ. 6 వేలు తీసుకుంటుండగా పట్టుకున్నారు. ఏఈ గోపాల్ ప్రస్తుతం గుడికుంట తండా గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తున్నారు. గోపాలు ఏసీబీ అధికారులు ఆఫీసుకు తరలించి విచారణ చేస్తున్నారు.

# కాలువలలో కంపచెట్లు పిచ్చి మొక్కలు

**-పంటలకు అందనీరు సాగునీరు**
**-పూడిక తీత పనులు వెంటనే చేయాలి :జూలకంటి**

**తరంగాలు/మిర్యాలగూడ ప్రతినిధి** మూడు సీజన్లలో పంటలకు సాగునీరు లేకపోవడంతో కాలువలు, కుంటలలో కంప చెట్లు, పిచ్చి మొక్కలు వ్యర్థ పదార్థాలతో నిండిపోయాయని వాటిని వెంటనే శుభ్రం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు సోమవారం మండలంలోని గూడూరు తండా గ్రామ శివారులో ఉన్న కృష్ణాపురం మేజర్ కాల్వ లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది వర్షాలు లేని కారణంగా సాగునీరు లేక పంటలు సాగు కాలేదని తెలిపారు. రెండు సంవత్సరాల పాటు నీళ్లు రానీ కారణంగా కాలువలలో కంప చెట్లు పిచ్చి మొక్కలు పెరిగిపోయాయని ముఖ్యంగా వ్యర్థ పదార్థాలు తో నిండి ఉన్నాయని తెలిపారు ప్రస్తుతం



సాగునీరు విడుదల చేసినప్పటికీ కాలువలలో వ్యర్థాలు ఉండటం వల్ల నీరు కిందికి వాడటం లేదని దాని ఫలితంగా పంట పొలాలకు నీరు అందడం లేదని చెప్పారు. కాలువలను శుభ్రం చేయాలని కాలువలకు ఇరువైపులా లైనింగ్ పనులు పూర్తి చేయాలని, రైతుల ఎన్నిమార్లు కోరుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శించారు. సాగునీరు వస్తుందని ఆశతో రైతులు పంటను సాగు చేసుకుంటున్నారని ఇప్పుడు ఎడమ కాలువకు నీటి విడుదల చేస్తున్నారని కాలువలను వ్యర్థాలు ఉండడం వల్ల పంట పొలాలకు నీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు తక్షణమే కాలువలను శుభ్రం చేసి కింది పంటలకు నీరందేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై సి ఈ నాగేశ్వరరావు, ఈఈ లక్ష్మణ్ నాయక్ సమస్యను వివరించారు స్పందించిన వారు తక్షణమే కాలువల పూడిక తీస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, సీనియర్ నాయకులు జగదీష్ చంద్ర, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాగిరెడ్డి మంగారెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి రవి నాయక్, వ్యవసాయం కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు పిల్లుట్ల సైదులు బాలాజీ నాయక్, సాగర్ నాయక్, సత్యనారాయణ, శ్రీను, హనుమంతు నాయక్, మంగ, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా కార్యదర్శిగా నీలారపు నరేందర్ యాదవ్



**తరంగాలు ప్రతినిధి/వరంగల్ :** బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆదేశాల మేరకు నర్సంపేట నియోజకవర్గం ఖానాపూర్ మండలం అశోక్ నగర్ గ్రామానికి చెందిన నీలారపు నరేందర్ యాదవ్ ను వరంగల్ జిల్లా కార్యదర్శి గా నియమించినట్లు వరంగల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్,నర్సంపేట నియోజకవర్గ ఇంచార్జ్ ద్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ద్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ నీలారపు నరేందర్ యాదవ్ కు నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం నీలారపు నరేందర్ యాదవ్ మాట్లాడుతూ నా నియామకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ నాయకులందరికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అదే విధంగా జిల్లాలో బీసీ లను బలోపేతం చేసేందుకు నా వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు జీజుల సాగర్, చెన్నూరి రవి, నర్సంపేట పట్టణ నాయకులు మద్దెల శ్యామ్ కుమార్ యాదవ్, బేతి భాస్కర్, ఓడపెల్లి రమేష్, ఆవుల పృథ్వీరాజ్, శీరంశెట్టి రాజేందర్, మర్రి క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ యోగి రెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

**-జిఎంపిఎస్ మండల కార్యదర్శి నల్లబెట్టా చిన్న రాజుయాదవ్**



**తరంగాలు ప్రతినిధి/వర్ధన్నపేట :** జర్నలిస్ట్ యోగి రెడ్డి కుటుంబన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని జిఎంపిఎస్ మండల కార్యదర్శి నల్లబెట్టా చిన్న రాజు యాదవ్ డిమాండ్ చేశారు. ఆర్థిక పరిస్థితులతో ఆగస్టు 9న కూతురితో సహా యువ జర్నలిస్ట్ యోగి రెడ్డి ఆత్మహత్యకు చేసుకోవడం బాధాకరమన్నారు.ఎన్నో సమస్యలపై కలాన్నే ఆయుధం గా చేసుకొని ప్రతి సామాజిక కార్య కర్తలకు, నిరుద్యోగులకు అండగా నిలిచిన జర్నలిస్టుకు ఇలాంటి దుస్థితి రావడానికి ప్రభుత్వాలే కారణమని అన్నారు.తక్షణమే ప్రభుత్వం స్పందించి వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం తో పాటు,50 లక్షలు అందించి, డబుల్ బెడు రూమ్ ఇల్లు ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

# అత్త మామలపై అల్లుడి దాడి..!!!

**-మామ మృతి..అత్తకు తీవ్ర గాయాలు**

**తరంగాలు ప్రతినిధి/ ములుగు :** ములుగు జిల్లా మంగపేట మండలంలో దారుణం జరిగింది.స్థానికుల కథనం ప్రకారం.. నీలాద్రిపేటలో అత్త మామపై అల్లుడు మల్లేశ్ కర్రతో దాడి చేశాడు. ఈ దాడిలో తీవ్ర గాయాలైన గొర్రె నర్సయ్య (60)ను హాస్పిటల్ కు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు.



దాడిలో తీవ్రంగా గాయపడిన మృతుడి భార్య ను ఏటూరునాగారం సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక చికిత్స నిమిత్తం తరలించగా పరిశీలించిన వైద్యులు. మెరుగైనవైద్యం కోసం వరంగల్ ఎంజీఎం కు తరలించారు.పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఖమ్మం గోల్డ్,సిల్వర్ నూతన భవనం ప్రారంభం



**తరంగాలు/ఖమ్మం జిల్లా బ్యూరో ఖమ్మం :**
స్థానిక వాసవి నగర్ లో వాసవి గార్డెన్స్ ఎదురుగా ఖమ్మం గోల్డ్ అండ్ సిల్వర్ జువెలర్స్ అసోసియేషన్ వారి నూతన ఆఫీస్ బిల్డింగ్ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరావు చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరిగింది.ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగిన ఈ కార్యక్రమం లో మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మీకు వ్యాపారస్తులకి ఎటువంటి ఇబ్బంది రాకుండా మిమ్మల్ని చక్కగా వ్యాపారం చేసుకోవడానికి స్వేచ్ఛ వాతావరణం కల్పిస్తుంది అని తెలియ చేశారు. అంతే కాకుండా ఖమ్మం పట్టణం అభివృద్ధి మీరు కోరుకున్న రీతిలో చేయడానికి నేను ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మేయర్ పునుకొల్లు నీరజ, నగర ఏ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బాల గంగాధర్ తీలక్, కమర్తపు మురళీ, మిక్కిలినేని నరేందర్ , కార్పొరేటర్ ఎల్లంపల్లి వెంకట్ రావు,ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిన్నికృష్ణ రావు, ప్రధాన కార్యదర్శి మెంతుల శ్రీశైలం, వైస్ ప్రెసిడెంట్ జివై.నరేష్ , ట్రెజరర్ తల్లాడ రమేష్, సహాయ కార్యదర్శి మన్నెం కృష్ణయ్య,బాలసాని లక్ష్మీనారాయణ తదితర ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరై ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ యొక్క కార్యక్రమం లో బంధు సూర్యం, కార్యదర్శి నకిరికంటి రాధాకృష్ణ సతీష్, ఈసీ మెంబర్లు గడ్డం శ్రీనివాస్ రావు, కొంకిమల్ల వేణు గోపాల్, బుర్లె లక్ష్మీ నారాయణ,సదానంద చారీ , యక్కల సుధాకర్, గట్ల సత్యం, మేకల నాగేశ్వర్ రావు, పెరం వీరభద్రమ్, రాయపూడి జయరాం, యడంకంటి రామారావు పాల్గొన్నారు.

# కేరళ వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలి

**-వయనాడ్ ప్రాంత వాసులకు ప్రజలు బాసటగా నిలవాలి**
**-వరద బాధితుల నిధి సేకరణ కార్యక్రమం చేపట్టిన ఏఐవైఎఫ్**



**తరంగాలు ,ఆలేరు ఆర్సీ :**
యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం సోమవారం రోజు మండలంలో అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్)తెలంగాణ రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఏఐవైఎఫ్ ఆత్మకూరు(ఎం)మండల కమిటి ఆధ్వర్యంలో కేరళ రాష్ట్రంలోని వయనాడ్ లో ఇటీవల సంభవించిన వరదల కారణంగా కొండచరియలు విరిగిపడ్డ ఘటనలో వందలాది మంది ప్రజలు మృత్యువాత పడ్డారు. వేలాదిమంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. అలా మృత్యువాత పడి నిరాశ్రయులు అయిన బాధితులకు అండగా నిలవాలని ఏఐవైఎఫ్ మండల కమిటీ వరద బాధితుల సహాయ నిధి సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పేరబొయిన మహేందర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పల ముత్యాలు మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలో సంభవించిన వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. కేరళ రాష్ట్రానికి చేయూతగా 5వేల కోట్లను ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. దేశంలో ఎక్కడ ఆకస్మిక విపత్తులు సంభవించినా ప్రజలంతా ఐక్యమత్యంతో సహాయసహకారాలు అందిచాల్సిన బాధ్యత పౌరులపై ఉంటుందని వారు ఉద్ఘటించారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు సహాయక చర్యలను వేగవంతం చేసుకోవడానికి పటిష్ట అధికార యంత్రాంగాన్ని తయారు చేయాలని వారు అన్నారు. అదేవిధంగా విపత్తులను ముందుగానే పసిగట్టడానికి మరింత సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి నయీమ్, సిపిఐ మండల కార్యదర్శి మారుపాక వెంకటేష్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు సుద్దాల సాయికుమార్, మేడి దేవేందర్ మహిళా సమాఖ్య నాయకురాలు గుర్రం రాజమణి, సిపిఐ నాయకులు బొబ్బాల లాల్ రెడ్డి, కలువల నర్సయ్య,పంజాల వెంకటేష్ ఇంజమీరి నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల మానసిక ఒత్తిడి తగ్గించెందుకు మోటివేషన్ కార్యక్రమం

**-ముఖ్య అతిథిగా సిబిఐ మాజీ డైరెక్టర్ జేడి లక్ష్మీనారాయణ**
**-వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్,చైర్మన్ మోషన్ జూనియర్ కాలేజీ**



**తరంగాలు /హన్మకొండ ప్రతినిధి**
హన్మకొండ నయీం నగర్ లోని రాజస్థాన్ కోటా మోషన్ ఐఐటీ,నీట్ జూనియర్ కాలేజీ ఆధ్వర్యంలో రేపు ఉదయం 10 గంటలకు అంబేద్కర్ భవన్ లో ఇంటర్ విద్యార్థులకు మోటివేషన్ ప్రోగ్రాం ఏర్పాటు చెయ్యడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిబిఐ మాజీ డైరెక్టర్ జేడి లక్ష్మీనారాయణ విచ్చేయుచున్నారని మోషన్ జూనియర్ కాలేజీ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ తెలిపారు.ఈ మోటివేషన్ ప్రోగ్రాంలో ముఖ్యంగా విద్యార్థులు ప్రస్తుతం ఎదుర్కొంటున్న మానసిక ఒడిదొడుకులు అదికమించెందుకు,విద్యార్థుల ఉన్నతమైన లక్ష్యసాధన కోసం జేడి లక్ష్మీనారాయణ సూచనలు, సలహాలు ఇవ్వనున్నట్లు వేణుగోపాల్ గౌడ్ తెలిపారు.

# రైతులకు కొత్త పంట రుణాలు ఇవ్వాలి

**-రాష్ట్ర కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు**





**తరంగాలు ప్రతినిధి/వరంగల్**
రుణ మాఫీ 2024 కింద లబ్ధి పొందిన రైతులకు త్వరగతిన తిరిగి కొత్త పంట రుణాలు ఇవ్వాలని రాష్ట్ర కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు అధికారులను ఆదేశించారు. సోమవారం వరంగల్ జిల్లా సహకార కేంద్రం ప్రధాన కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు అధ్యక్షతన డిసిసిబి బ్యాంక్ మేనేజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.లోన్ రికవరీ మరియు పాలసీ మార్గదర్శకాలపై,విద్య రుణాలు,దీర్ఘకాలిక రుణాలు, బంగారం రుణాలు,డిపాజిట్స్ పై చర్చించారు.ఈ సందర్భంగా మార్నేని రవీందర్ రావు మాట్లాడుతూ అర్హత గల రైతులకు సంబంధించిన ఇన్వాలీడ్ ఆదార్ లుగా ఉన్నటువంటి ఎర్రర్ లను ప్రభుత్వం వారి అనుమతితో ఈ నెల 19 వ తేది లోగా సరియైన ఆధార్ కాపీలను సమర్పించి రైతులకు లబ్ధి చేకూరేలా చేయాలని సూచించారు.అర్హులైన రైతుల యొక్క రుణాలను ప్రభుత్వానికి సమర్పించడంలో అలసత్వాన్ని ప్రదర్శించిన సంఘాల సిబ్బందిని భాద్యులను చేయవలసిందిగా సంబధిత డిసిఓ లకు సమాచారం ఇవ్వాలని బ్యాంక్ సీఈఓ ని ఆదేశించారు.ప్రతి సంఘాలను సందర్శించి ఋణ మాఫీ పొందిన రైతులకు విలైనంత త్వరగా తిరిగి రెన్యువల్ చేయాల్సిందిగా తద్వారా రైతులకు వానాకాలం పంటల సాగుకు పెట్టుబడి ఇబ్బందులు తలెత్తకుండా సాగు చేస్తారని సూచించారు.ఈ సమావేశంలో సీఈఓ వజీర్ సుల్తాన్, డీజీఎం అశోక్,ఏజిఎంలు మధు,గొట్టం స్రవంతి,కృష్ణ మోహన్,గంప శ్రవంతి,రాజు,వివిధ శాఖల బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.

# పోగొట్టుకున్న 19 ఫోన్లు రికవరీ

**-సీసీఎస్ పోలీసులు,కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ సి ఐ**







**తరంగాలు/హన్మకొండ క్రైమ్:**
సోమవారం రోజు కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో నివసిస్తున్న వివిధ వ్యక్తులు పోగొట్టుకున్న 19 సెల్ ఫోన్లు ట్రేస్ చేసి బాదితులకు అప్పగించడం జరిగింది . వరంగల్ పోలీస్ కమిషనరేట్ పోలీస్ స్టేషన్ కాకతీయ యూనివర్సిటీ పరిధిలో సెల్ ఫోన్ యజమానులు పోగొట్టుకున్న సెల్ ఫోన్ల వివరాలు వెంటనే సి.ఈ.ఐ.ఆర్ పోర్టల్ బ్లాక్ చేసి, పోలీసు స్టేషన్ కాకతీయ యూనివర్సిటీ లో సమాచారం ఇవ్వగా, వరంగల్ పోలీస్ కమిషనర్ అయినా అంబర్ కిషోర్ ఝా ఐపిఎస్ ఆదేశాలమేరకు మేరకు ఈ రోజు 19-సెల్ ఫోన్లు సిసిఎస్ వారి సహకారము తో ట్రేస్ చేసి సంబందిత సెల్ ఫోన్ యజమానులకు అప్పగించడం జరిగింది. పోగొట్టుకున్న సెల్ ఫోన్స్ తిరిగి లభించడంతో వాటి యాజమానులు వరంగల్ పోలీస్ కమీషనర్ కి హృదయ పూర్వక ధన్యవాదములు తెలిపినారు. ఈ సందర్భంగా కాకతీయ యూనివర్సిటీ ఇన్స్పెక్టర్ బి. సంజీవ్ మాట్లాడుతూ పోలీస్ శాఖ ఎప్పుడు ప్రజల పక్షాన పని చేస్తుందని ఎపుడు ఎవరికీ ఏ సమయం లో ఎలాంటి అవసరం ఉన్న పోలీస్ వారిని సంప్రదించమని ఉన్నతధికారుల ఆదేశాలను శిరసావహిస్తు ప్రజల మన్ననలు పొందేవిధంగా విధులు నిర్వహిస్తామని పేర్కొనడం జరిగింది.

# ఫోన్ పోతే చింతించకండి

**-వరంగల్ సిపి అంబర్ కిశోర్ ఝా**





**తరంగాలు/హన్మకొండ క్రైమ్ :**
సెల్ ఫోన్ యజమానులు తమ ఫోన్ పోగొట్టుకుంటే చింతించవద్దని... తక్షణమే సి.ఇ.ఐ.ఆర్ పోర్టల్ లో ఫిర్యాదు చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రజలకు సూచించారు.వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సెల్ ఫోన్ యజమానులు పోగొట్టుకున్న సెల్ ఫోన్ల స్వాధీనం చేసుకొని సిసిఎస్ పోలీసుల ఆధ్వర్యంలో సెల్ ఫోన్ రికవరీ మేళా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పోగొట్టుకున్న సెల్ ఫోన్ల ఆచూకీ కనుగొని పోలీస్ స్వాధీనం చేసుకున్న సెల్ ఫోన్ల ను వరంగల్ పోలీస్ కమిషనర్ చేతులమీదుగా సెల్ ఫోన్ యజమానులకు అందజేశారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ దొంగతనం కాని పోగొట్టుకున్న సెల్ ఫోన్ల ఆచూకీ సిసిఎస్ తో పాటు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇప్పటి వరకు 7022 సి.ఇ.ఐ.ఆర్ పోర్టల్ లో ఫిర్యాదు చేయగా ఇందులో 4028 సెల్ ఫోన్లను గుర్తించి అందులో ఇప్పటి వరకు 2527 సెల్ ఫోన్ల ను స్వాధీనం చేసుకొని సెల్ ఫోన్ యజమానులకు అందజేయడం జరిగిందని, గత వారంరోజుల పాటు సిసిఎస్ పోలీసులు శ్రమించి 150కు పైగా సెల్ ఫోన్ల ను స్వాధీనం చేసుకోవడం జరిగిందని, సెల్ ఫోన్ దొంగతనాల నుండి విముక్తి కల్పించడానికై డిపార్ట్మెంట్ ఆఫ్ టెలీ-కమ్యూనికేషన్ సి.ఇ.ఈ.ఆర్ పోర్టల్ ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని, ఈ పోర్టల్ ద్వారా మంచి ఫలితాలు రాబట్టడం జరుగుతుందన్నారు. ఎవరైన మొబైల్ పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన వెంటనే సి.ఇ.ఐ. ఆర్ పోర్టల్ (https://www.ceir.gov.in) నందు బ్లాక్ చేసి, సంబందిత పోలీసు స్టేషన్ లో సమాచారం ఇవ్వాలని పోలీస్ కమిషనర్ ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిసిఎస్ ఇన్స్పెక్టర్ అబ్బయ్య, ఎ.ఎస్.ఐ గోపాల్ రెడ్డి, ఐటీ కోర్ హెడ్ కానిస్టేబుల్ మాధవరావు, హెడ్ కానిస్టేబుల్ రాములుతో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అందర్నీ చల్లంగా చూడు తల్లి

**-టీవైజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ తనుగుల జితేందర్ రావు**





**తరంగాలు /హన్మకొండ ప్రతినిధి**
రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తూ అందరినీ చల్లంగా చూడాలని యాప్రాల్ పెద్దమ్మ తల్లిని టీవైజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ తనుగుల జితేందర్ రావు వేడుకున్నారు.మల్కాజిగిరి జిల్లా యాప్రాల్ పెద్దమ్మ తల్లి దేవస్థానం ముదిరాజ్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన బోనాల ఉత్సవాల ఆహ్వానం మేరకు ఆయన హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జితేందర్ రావును ఆ దేవస్థాన ముదిరాజ్ కమిటీ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో శ్రీ పెద్దమ్మ తల్లి ముదిరాజ్ కమిటీ అధ్యక్షులు కావలి చంద్రశేఖర్ ముదిరాజ్,ఉపాధ్యక్షులు శ్రీనివాస్ ముదిరాజ్,చంద్రయ్య ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి ఆకుల నరేష్ ముదిరాజ్,కోశాధికారి సాయిబాబా ముదిరాజ్,కార్యదర్శి కొండయ్య ముదిరాజ్,సహాయ కార్యదర్శులు గోపాల్ ముదిరాజ్,ఆనంద్ ముదిరాజ్,బాబు ముదిరాజ్ తో పాటు సంఘ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

తరంగాలు Tharangalu Daily News Paper

# పామాయిల్ రైతులకు నష్టం రానివ్వం

**-ఆయిల్ పామ్ రైతులకు ప్రోత్సాహం లో భాగమే**
**హబ్‌గా భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా**
**-ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి**



తరంగాలు ప్రతినిధి/ వరంగల్ : తెలంగాణ రాష్ట్రం లో ఫామయిల్ సాగు రైతులకు ఎటువంటి నష్టం రానివ్వమని ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.పలు పత్రికలలో నూనె దిగుబడి ,రవాణా పలు విషయాలలో అనుమానాలు తలెత్తే విధంగా కథనాలపై చైర్మన్ రాఘవ రెడ్డి వివరణ ఇచ్చారు.ఆయిల్ ఫామ్ సాగులో ఇప్పటికే దశాబ్దాలుగా అనుభవం ఉన్న ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులకు అవగాహన ఉందని అన్నారు.వరంగల్ ,కరీంనగర్, మహబూబ్ నగర్ ,మెదక్ జిల్లాల్లో ఆయిల్ ఫామ్ సాగు విస్తరణ పెంచాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ ద్వారా ఇతర ప్రాంతాల రైతులకు ఇచ్చే సదుపాయాలు కల్పిస్తుందని జంగా రాఘవ రెడ్డి అన్నారు.ఈ జిల్లాలోని ఆయిల్ పామ్ గెలలను ప్రాసెసింగ్ చేయడానికి ప్రస్తుతం రాష్ట్రంలో అశ్వారావుపేట ,అప్పారావు పేట మిల్లులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.ఇప్పటికే డిమాండ్ కు అనుగుణంగా సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని నర్మెట లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ మిల్లు ను నిర్మిస్తున్నారని త్వరలోనే అందుబాటులోకి రానుందని పేర్కొన్నారు.తొర్రురు తో పాటు ఇంకొ నాలుగు ప్రాంతాల్లో ప్రాసెసింగ్ మిల్లులను ఏర్పాటుకు కృషి చేస్తున్నమన్నారు.ఇతర జిల్లాల నుంచి వచ్చే నూతన ఆయిల్ పామ్ గెలాల వల్ల అశ్వారావుపేట మిల్ లో ప్రాసెసింగ్ జరుగుతుందని ఇది ఖమ్మం ఉమ్మడి జిల్లాల ఆయిల్ పామ్ సాగు రైతుల పై ప్రభావం చూపదని అన్నారు.ఈ విషయం లో రైతులు ఎటువంటి అనుమానాలు..అపోహలకు పోవద్దని అన్నారు.రైతు ను రాజు చేసేందుకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు ఇంకో రైతు ను నష్టం చేయడానికి కాదని అన్నారు. పత్రికలలో వస్తున్నట్లు ఏదో ప్రయివేటు కంపెనీల కు లాభం చేకూర్చే ఉద్దేశ్యం మా ప్రభుత్వానికి లేదన్నారు. స్వయంగా రైతు బిడ్డ నైన తాను ఎట్టి పరిస్థితి లో ఆయిల్ పామ్ రైతాంగానికి నష్టం రానివ్వని భరోసా ఇచ్చారు.

## నేడే ఎస్సీ వర్గీకరణ విజేత మంద కృష్ణ మాదిగ ఢిల్లీ నుండి హైదరాబాద్ రాక

**-హైదరాబాద్ లో జరిగే విజయోత్సవ ర్యాలీకి భారీగా తరలి రావాలి నల్ల చంద్ర స్వామి మాదిగ**



తరంగాలు ,ఆలేరు ఆర్సీ : ఎంఆర్పీఎస్ రాష్ట్ర నాయకులు ఏంఎస్పీ జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ మాట్లాడుతూ హలో మాదిగన్న. మన అన్న వస్తున్నాడు. నువ్వు ఏ పార్టీలో ఉన్నా. ఏ సంఘంలో ఉన్నా.ఏ ఆలోచనతో ఉన్నా . ఏ సిద్ధాంతంతో ఉన్నా. హైదరాబాద్ కు తరలిరా.ఇది మన జాతి గెలుపును ప్రపంచానికీ చాటి చెప్పి చెప్పే సందర్భం. ఎన్నో ఘర్షణలను, సంఘర్షణలను ఓడించి దేశ నుదుటి మీద మాదిగల సంతకం పెట్టిన మహావీరుడు మంద కృష్ణ మాదిగ. అన్న వస్తున్న సందర్భం నేడు హైదరాబాద్ కు తరలిరండి. పార్టీలకు , సంఘాలకు అతీతంగా మాదిగ బిడ్డలందరు పెద్ద ఎత్తున తరలిరండి. హైదరాబాద్ గడ్డ మీద దప్పుల శబ్దంతో విజయోత్సవ ధ్వనిని వినిపిద్దాం. మాదిగ బిడ్డలందరీని ప్రేమతో ఆహ్వానిస్తున్నాం అని అన్నారు.

## విజ్ఞప్తులు సత్వరమే పరిష్కరించాలి

**-జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా**






వరంగల్ జిల్లా బ్యూరోతరంగాలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన విజ్ఞప్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అధికారులను ఆదేశించారు. ప్రజావాణికి వచ్చే ఫిర్యాదీదారులతో మమేకమై వారి సమస్యలను సావధానంగా పరిశీలించి పరిష్కార దిశగా కృషి చేయాలని, నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. పరిష్కరించుటకు వీలులేని పక్షంలో తదుపరి చర్యల కోసం వారికి అర్థమయ్యే విధంగా సూచనలు అందించాలన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి 265 విజ్ఞప్తులను అదనపు కలెక్టర్ డిఆర్డిఏ పిడి కౌసల్యాదేవి, జడ్పీ సీఈఓ రామిరెడ్డి, ఆర్డీఓ కృష్ణ వేణి లతో కలిసి స్వీకరించారు. అందులో 70 రెవెన్యూ శాఖకు, 159 ఎస్సి కార్పొరేషన్ కు , 4 గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్, 3 డిపిఓ, 3 నర్సంపేట మెడికల్ కళాశాల, మిగిలిన శాఖలకు ఒకటి చొప్పున దరఖాస్తు వచ్చాయి.ఈ ప్రజావాణి లో అన్ని శాఖల జిల్లా అధికారులు కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన

**-వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య**



వరంగల్ జిల్లా బ్యూరో/ తరంగాలు: హనుమకొండ, హరిత కాకతీయ హొటల్ లో జరిగిన సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి కూతురు నేదునూరి అపూర్వ ఆదర్శ వివాహానికి ఎంపీ డా.కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ... ఆదర్శ వివాహం చేసుకుంటున్న నూతన దంపతులు నేదునూరి అపూర్వ - సముద్రాల శ్రీధర్ లకు శుభాకాంక్షలు తెలియజేశారు. భార్య భర్తల బంధం చాలా గొప్పదని ఆబంధాన్ని ప్రతి ఒక్కరు కాపాడుకోవాలని అన్నారు. తాను ఆదర్శ వివాహం చేసుకున్నాని ఎంపీ తెలిపారు. మా నాన్న కడియం శ్రీహరి నేను ఆనందంగా వుండాలని భావించి ఆదర్శ వివాహం జరిపించారని, స్పెషల్ యాక్ట్ ప్రకారం మ్యారేజ్ చేసుకున్నానని తెలియజేశారు. నేను ఎంపీగా ఈస్థాయిలో ఉన్నాను అంటే అందుకు కారణం ఒకరు నా తండ్రి కడియం శ్రీహరి అయితే మరొకరు నా భర్త నజీర్ అని అన్నారు. భార్యాభర్తలు ఒకరినొకరు గౌరవించుకుంటూ జీవితంలో ముందుకు వెళ్లాలని ఈ సందర్భంగా సూచించారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు , సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడా వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.అనంతరం హంటర్ రోడ్, కోడెం కన్వెన్షన్ లో డా.సోమశేఖర్ కూతురు డాక్టర్ శివ రచన - నటరాజ్ వివాహానికి హాజరై నూతన వధూవరులకు ఆశీర్వదించి,శుభాకాంక్షలు తెలియ జేశారు.

## రజక వృత్తిదారులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

**-ప్రభుత్వ కార్యాలయాలలో ధోభీ పోస్టులు రజకులకే కేటాయించాలి**



తరంగాలుప్రతినిధి /మహబూబ్ నగర్: మహబూబ్నగర్ జిల్లా కేంద్రం తెలంగాణ చౌరస్తాలోని జ్యోతిరావు పూలే హాల్ వద్ద తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.రాజు,పట్టణ అధ్యక్షులు సి.నాగరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సమావేశానికి నేషనల్ ధోబి రిజర్వేషన్ సంఘ్ జాతీయ కన్వీనర్ నడిమింటి శ్రీనివాస్,రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక, ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షులు కేతూరి శివన్న, ప్రధాన కార్యదర్శి ఎస్.చంద్రమౌళి ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వాసి అయినా ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి పాలమూరు జిల్లా స్థితిగతులపై సంపూర్ణంగా తెలిసిన వారు కావున రజక కులస్తులు అభివృద్ధి కాంక్షించే వారైతే తక్షణమే ఎస్సీ జాబితాలో చేర్చే అంశాన్ని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని కోరారు.ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షులు కేతూరి శివన్న మాట్లాడుతూ నీళ్లు నిధులు నియామకాల కోసం ఏర్పడిన తెలంగాణలో 10 సం.లుగా ఉద్యోగాల కోసం అప్పులు తెచ్చి కోచింగ్ సెంటర్లకు ఫీజులు కట్టి కోచింగ్ పంపిస్తే మేఘా డిఎస్సీ అంటే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 50 వేల పైచిలుకు ఉద్యోగాలకు నోటిఫికేషన్ చేసేవారు కాని తెలంగాణ వచ్చాక సుమారు 14 వేల ఉద్యోగాలు వేస్తే జిల్లాకు క్యాటగిరివైస్ గా 10 పోస్టులకు పోటీపడలేక ఉద్యోగం రాక తెచ్చిన అప్పులు కట్టలేక వలసలు వెళ్లి కూలినాలి చేసుకొని బతుకుతున్నారు.కావున వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని నిరుద్యోగ రజక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు.ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి సి.చంద్రమౌళి మాట్లాడుతూ పాలమూరు జిల్లా రజక కులస్తులు వ్యవసాయ భూములు లేక ఎలాంటి ఉపాధి అవకాశాలు లేక కేవలం రజక వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు కావున పాలమూరు జిల్లా రజక వృత్తిదారులకు ఉపాధి అవకాశాల కింద ప్రత్యేక బడ్జెట్ కేటాయించి వారి అభివృద్ధికి తోడ్పడాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు బండారు బాలకృష్ణ, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ మడెలయ్య నాగేష్, నారాయణపేట నాయకులు సి.నర్సిములు, జిల్లా సీనియర్ నాయకులు లింగంగారి పెంటయ్య, ఆంజనేయులు, యాదయ్య, ఏ.గోపాల్, ఎస్ .నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ యూనివర్సిటీల పరిరక్షణకై ఉద్యమిస్తాం







**-తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీల ఇంచార్జ్ రెహమాన్, ఏఐఎస్ఎఫ్**
**-కాకతీయ యూనివర్సిటీలో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయాలి**
**- ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా కార్యదర్శి భాషబోయిన సంతోష్**
**-కాకతీయ యూనివర్సిటీలో ఘనంగా ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవం**

తరంగాలు ప్రతినిధి/ వరంగల్ : తెలంగాణ ప్రభుత్వం తక్షణమే ప్రభుత్వ యూనివర్సిటీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీల ఇంచార్జ్ రెహమాన్ అన్నారు. సోమవారం ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవం కాకతీయ యూనివర్సిటీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జెండాను ఎగురవేసిన రెహమాన్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో విద్యార్థులను, యువకులను ఏకం చేసి బ్రిటిష్ వారిని తరిమిన చారిత్రక నేపథ్యం వున్న సంఘం ఏఐఎస్ఎఫ్ అని అన్నారు. 1936, ఆగస్టు 12న ఏర్పడిన ఏఐఎస్ఎఫ్ విద్యారంగ సమస్యలపై అలుపెరుగని ఉద్యమాలు నిర్వహిస్తోందని తెలిపారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో గత పది సంవత్సరాలుగా యూనివర్సిటీలు నిర్లక్ష్యానికి గురయ్యాయని, యూనివర్సిటీల విద్యార్థుల పట్ల ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించిందని రెహమాన్ తెలిపారు. గత ప్రభుత్వం వైఫల్యాలపై ప్రజలను చైతన్యపరిచి, పోరాటాలు నిర్వహించిన ప్రభుత్వ యూనివర్సిటీలపై నూతనంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని రెహమాన్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలలో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని, పెంచిన పీజీ, పీహెచ్డీ ఫీజులు తగ్గించాలని కోరారు. పూర్తి స్థాయి వీసీలను నియమించి నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాకతీయ యూనివర్సిటీలో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని, పూర్తి స్థాయిలో వీసీని నియమించాలని, విద్యార్థులకు హాస్టల్ సౌకర్యాలు మెరుగు పరచాలని హనుమకొండ జిల్లా కార్యదర్శి భాషబోయిన సంతోష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఉట్కూరి ప్రణీత్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు వేల్పుల చరణ్, కుక్కల కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి కసరబోయిన రవితేజ, జిల్లా సమితి సభ్యులు సీపతి వినయ్,కేయు నాయకులు చరణ్, తిలక్, సాయి, ప్రవీణ్, గౌతమ్, చందు, వినయ్, సాయి ప్రకాష్, సురేష్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**వరంగల్ జిల్లా బ్యూరో తరంగాలు**
నిరుపేద కుటుంబానికి మాజీ ఉప ముఖ్యమంత్రి స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి ఆర్థికసాయం చేసి, వారికి అండగా నిలిచారు. వేలేరు మండలం, వేలేరు గ్రామానికి చెందిన సలీం ఇటీవల మృతి చెందగా ప్రస్తుతం ఇద్దరు ఆడపిల్లలతో భార్య సుల్తానా పేదరికంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారి కుటుంబ పరిస్థితి గురించి తెలుసుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి చలించిపోయారు. హనుమకొండ, కనకదుర్గ కాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో వారి జీవనోపాధి కోసం కుట్టు మిషన్ కొనుగోలు చేసేందుకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా సుల్తాన కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే కడియం శ్రీహరి కి కృతజ్ఞతతో తెలిపారు. ఈ కార్యక్రమంలో వేలేరు మాజీ సర్పంచ్ మల్లిఖార్జున్ సుల్తాన కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి

**-స్వాతంత్ర దినోత్సవ వేడుకల ముందస్తు ఏర్పాట్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన జిల్లా అధికారులు**
**-జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా**





**వరంగల్ జిల్లా బ్యూరో తరంగాలు**
స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా, అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఖిలా వరంగల్ ఖుష్ మహల్ మైదానంలో కలెక్టర్ డిసిపి రవీందర్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి లతో కలసి స్వాతంత్ర దినోత్సవ వేడుకల ముందస్తు ఏర్పాట్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు తగు సూచనలు, ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల్లో ప్రొటోకాల్ అనుసరించి సీటింగ్ ఏర్పాట్లను, స్టేజ్ ఏర్పాట్లు, తాగునీటి సరఫరా, పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాట్లను పటిష్టంగా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని గౌరవ ముఖ్య అతిథితో జాతీయ పతాక ఆవిష్కరణ ఉన్నందున ఇందుకు సంబంధించి ఏర్పాట్లు, స్టేజి అలంకరణ, నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. స్వాతంత్ర దినోత్సవం వేడుకలకు విచ్చేసే ఆహూతులకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వాటర్ ప్రూఫ్ టెంట్స్, తాగు నీరు, టాయిలెట్స్ ఏర్పాటు సీజేయలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించే కార్యక్రమాలను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ. కృష్ణ వేణి, జిల్లా రోడ్ల భవనాల అధికారి రెడ్డి, తహసీల్దార్ నాగేశ్వర్ రావు, పోలీస్ అధికారులు, వరంగల్ మహా నగర పాలక సంస్థ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలి





**-బిజెపి హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ రెడ్డి**
**- మహిళ మోర్చ అధ్వర్యంలో తిరంగ మోటార్ బైక్ ర్యాలీ**

**తరంగాలు ప్రతినిధి /హన్మకొండ :**
ఆగస్టు 15న ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలని బిజెపి అనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ పిలుపునిచ్చారు. సోమవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బిజెపి మహిళ మోర్చ ఆధ్వర్యంలో హనుమకొండ అదాలత్ నుండి హనుమకొండ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ యొక్క ర్యాలీనీ బిజెపి హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ ముగింపు సందర్భంగా హనుమకొండ చౌరస్థలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మహిళ మోర్చ జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి రత్నా లక్ష్మి, మహిళ మోర్చ నాయకులు ఉష రెడ్డి, శ్రీలత, అంబీర్ కవిత, స్వాతి, అరుణ, ఉమ, తులసి, కవిత, శ్రీదేవి, వాణి, ఉష, సువర్ణ, రజినీ, స్వర్ణలత, లక్ష్మి, సోని, కవిత నాయక్, బిజెపి నాయకులు రవీందర్ రెడ్డి, సంపత్ రెడ్డి, ప్రసాద్,కళ్యాణ్, శ్రావణ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## పాలకులు మారిన మారని బునాదిగాని కాలువ పనులు

**-సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ముత్యాలు**



**తరంగాలు ,ఆలేరు ఆర్సీ :**
ప్రభుత్వాలు మారిన మండల పరిధిలోని బునాదిగాని కాలువ పనులు పూర్తి కావడం లేదని సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యవర్గ సభ్యులు ముత్యాలు అన్నారు. ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో సోమవారం రోజు ఏర్పాటు చేసిన సిపిఐ పార్టీ కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ మాజీ శాసనసభ్యులు ఉప్పునూతల పురుషోత్తం రెడ్డి ప్రారంభించిన బునాదిగాని కాలువ పనులు గత10 సంవత్సరాలు బిఆర్ఎస్ ప్రభుత్వంలో పూర్తి కాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో బునాదిగానీ కాలువ పనులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తానని శాసనసభ్యులు ఇచ్చిన హామీని వెంటనే రైతులకు సాగునీరు అందించేలా కృషి చేయాలని కోరారు. బునాదిగాని కాలువ పరిధిలో ముగ్గురు శాసన సభ్యులు, ఎంపీ చోరవతో త్వరలో పూర్తిచేసి రైతులకు సాగునీరు అందించాలని కోరారు. మండల కేంద్రంలో మోత్కూరు బోనగిరి ప్రధాన రహదారి నుండి శివాలయం వరకు గుంతల మయంగా ఉండి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టి సమస్య పరిష్కరించాలని కోరారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో కేరళలోని వాయినాడ్ లో కొండ చర్యలు విరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కున్నారని, కొంతమంది మృతి చెందారని ఆ ప్రాంత ప్రజలకు సహకారం కోసం తెలంగాణ రాష్ట్ర అఖిలపక్ష భారత యువజన సంఘం ఆధ్వర్యంలో నిధుల సేకరణ చేపడుతున్నామని దీనికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. బొబ్బల లాల్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల సిపిఐ కార్యదర్శి మారుపాక వెంకటేశం, మండల కార్యవర్గ సభ్యులు కసరబోయిన సత్తయ్య,జక్క దయాకర్ రెడ్డి, ఎండి నయీమ్, కలువల నరసయ్య, మండల నాయకులు గుర్రం రాజమణి, యాస బుచ్చిరెడ్డి, సుల్తాన్ పురుషోత్తం పాల్గొన్నారు.

# ఆగస్టు 15న ప్రతీ ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేయాలి







**-తిరంగ యాత్రలో పాల్గొన్న బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్**

**తరంగాలు ప్రతినిధి /వరంగల్ :**
ప్రతీ ఒక్కరు ఆగస్టు 15న తమ ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ పిలుపునిచ్చారు. సోమవారం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి సూచనల మేరకు రాష్ట్ర బీజేవైఎం ఆదేశాలనుసారం హర్ ఘర్ తిరంగ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. వరంగల్ జిల్లా బీజేవైఎం అధ్యక్షులు ఎర్రగోళ్ల భరత్ వీర్ ఆధ్వర్యంలో తిరంగ యాత్ర పోచమ్మ మైదాన్ నుండి వరంగల్ రైల్వే స్టేషన్ వరకు 75 అడుగుల పొడవుతో వున్నా జాతీయ జెండా తో దాదాపు 300 మంది యువతతో తిరంగ యాత్ర నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో పోరాడి అమరులైన వారి త్యాగాలను గుర్తు చేస్తూ మరియు దేశాన్ని ఏకం చేయడానికి సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషిని దేశం ఎప్పుడూ గుర్తుంచుకుంటుందని, మన ప్రధాని నరేంద్ర మోడీ అభివృద్ధి చెందిన భారతదేశం యొక్క దృక్పథాన్ని సాకారం చేసే దిశగా దేశాన్ని నడిపిస్తున్నారని ప్రతీ ఒక్కరిలో జాతీయ భావం పెంపొందించేందుకు బీజేపీ కృషి చేస్తోందన్నారూ. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు, బీజేవైఎం కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు




## టీపీసీసీ లీగల్ సెల్ వరంగల్ జిల్లా చైర్మన్ గా శామంతుల శ్రీనివాస్



**తరంగాలు /హన్మకొండ ప్రతినిధి**
తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ వరంగల్ జిల్లా కమిటీకి చైర్మన్ గా శామంతుల శ్రీనివాస్, కన్వీనర్ గా కొక్కొండ రమేష్ నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని సోమవారం జిల్లా,రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు ముద్దసిర్ అహ్మద్ ఖయ్యుమ్, నిమ్మని శేఖర్ రావు, బైరాపాక జయాకర్, కే. అంభరీష్ రావు చేతుల మీదుగా స్వీకరించరు. అలాగే కమిటీ వైస్ చైర్మన్లు, జాయింట్ కన్వనోర్లు ను నియమించారు. వైస్ చైర్మన్లు గా ఈ. ఆనంద్ మోహన్,మొహమ్మద్ ఆజం,గునిగంటి శ్రీనివాస్,ఇజ్జగిరి సురేష్,కొడిదల సంజయ్ కుమార్,గంప వెంకట రమణ కాగా జాయింట్ కన్వీనర్లు గా జి.వి రమణ మూర్తి,గన్ను హరిహర కుమార్,ఎం. శ్రీనాథ్ బాబు,రొడ్డ అమృత్ రావు,రాచర్ల సురేష్,మొహమ్మద్ జానిలను నియమిస్తూ టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ జిల్లా కోర్ట్ లో సీనియర్ న్యాయవాదులు గా వీరు పనిచేస్తున్నారు. తమ పై ఎంతో నమ్మకం తో చైర్మన్ గా నియమించినందుకు శామంతుల శ్రీనివాస్,మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నిరంతరం పార్టీ ఆదేశాలను తుచా తప్పకుండ పాటిస్తామని,లీగల్ సెల్ రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ కు,సీఎం రేవంత్రెడ్డికి,మంత్రులు కొండా సురేఖ,సీతక్క,ప్రభాకర్,ఎంపీ లకు,ఎమ్మెల్యే లకు ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ నాయకులకు,న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు.

# రుణమాఫీ డబ్బులు ఇతర రుణాల కింద జమ చేయొద్దు

**-పంట రుణాలు మాఫీ పొందిన రైతులకు వెంటనే రుణాలు రెన్యూవల్ చేసుకొనేలా ప్రోత్సహించాలి.**

**-జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా**






వరంగల్ జిల్లా బ్యూరో/ తరంగాలు:

రుణమాఫీ డబ్బులు ఇతర రుణాల కింద జమ చేయొద్దని,పంట రుణాలు మాఫీ పొందిన రైతులకు వెంటనే రుణాలు రెన్యూవల్ చేసుకొనేలా అధికారులు ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మొదటి, రెండవ విడతల్లో రైతు రుణమాఫీ, రెన్యూవల్ పురోగతిపై బ్యాంకర్లు, వ్యవసాయ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెండు విడతల్లో లక్షన్నర రూపాయల వరకు చేపట్టిన రుణమాఫీ పథకంలో రైతులకు లబ్ధి చేకూరేలా చూడాలన్నారు. దీనిపై రైతులకు ఉన్న సందేహాలను నివృత్తి చేయాలని ఆదేశించారు.పంట రుణాలు పొందిన డబ్బులను వ్యవసాయ పనుల నిమిత్తం వాడుకునేలా రైతులకు చెల్లించాలన్నారు. కొత్త రుణాలు సకాలంలో చెల్లించి రైతులకు ఉపయోగపడేలా చూడాలని సూచించారు. వ్యవసాయ విస్తరణాధికారి, వ్యవసాయాధికారులు, బ్యాంక్ అధికారులు రుణాలు రెన్యూవల్ పై రైతుల్లో అవగాహన కల్పించి ప్రోత్సహించాలని, పంట రుణాల రెన్యూవల్ త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.గ్రీవెన్స్ లో స్వీకరించిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని తెలిపారు. రుణమాఫీపై జిల్లా వ్యాప్తంగా గ్రీవెన్స్ సెల్ కు నేటి వరకు 220 ఫిర్యాదులు రాగా వాటిని పరిష్కరించడం జరిగిందన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా వ్యవసాయ అధికారి ఉషా దయాల్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజు , జిల్లా సహకార అధికారి సంజీవ రెడ్డి, వ్యవసాయ, బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఏఎస్ఈజడ్ విశ్వవిద్యాలయ విద్యార్థులకు ప్రశంస పత్రాన్ని అంజేసిన

**-వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య**



వరంగల్ జిల్లా బ్యూరో/ తరంగాలు:

ఏ ఎస్ ఈ జడ్ విశ్వవిద్యాలయ విద్యార్థులు "సేవ్ ది ఎర్త్ అనే కార్యక్రమం ద్వారా ప్రపంచవ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. ఇటీవల బట్టుపల్లి చెరువు వద్ద 350 మంది ఏఎస్ఈ జడ్ సభ్యులతో కలసి ఎంపీ డా.కడియం కావ్య 500 మొక్కలు నాటారు. విద్యార్థుల సేవలను గుర్తించి వారిని మరింత ప్రోత్సహిస్తూ సోమవారం హనుమకొండ, కనకదుర్గ కాలనీలోని ఎంపీ నివాసంలో ఏ ఎస్ ఈ జడ్ విశ్వవిద్యాలయ విద్యార్థులకు ఎంపీ డా.కడియం కావ్య ప్రశంస పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ... ప్రజలను మార్చడం ద్వారా సంతోషకరమైన ప్రపంచాన్ని సృష్టించడం ఏ ఎస్ ఈ జడ్ లక్ష్యం అని తెలియజేసారు. ఏ ఎస్ ఈ జడ్ ప్రపంచవ్యాప్తంగా 175 దేశాలలో నేరాల తగ్గింపు, వాతావరణ మార్పుల ప్రతిస్పందన, సమాజ సేవ మరియు విపత్తు ఉపశమనం కోసం కార్యకలాపాలను నిర్వహిస్తోందని పేర్కొన్నారు. విద్యార్థులు వారి విలువైన మరియు అద్భుతమైన కృషి మరియు పనితీరుతో ఏ ఎస్ ఈ జడ్, వరల్డ్ మిస్సన్ సొసైటీ చర్చ్ ఆఫ్ గాడ్ యూనివర్శిటీ ద్వారా వాలంటీర్ గ్రూప్ లద్వారా సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు భవిష్యత్తులోను కొనసాగించాలని వారికి సూచించారు.

## ఎంపీ డా.కడియం కావ్యని కలసి వినతి పత్రం అందజేసిన సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు



వరంగల్ జిల్లా బ్యూరో తరంగాలు

సీనియర్ సిటిజన్స్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ హనుమకొండ, విద్యారణ్యపురి, గోపాలపురానికి చెందిన సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ని వారి నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. వరంగల్, హనుమకొండ, కాజీపేట లలో వయోవృద్ధులకు విశ్రాంతి కేంద్రంలో డే కేర్ సెంటర్ లో ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా కేంద్రంలోని మహాత్మా గాంధీ స్మారక వైద్యశాలలో వయోవృద్ధులకు ఓపి విభాగము 2021 లో ప్రారంభించినప్పటికీ, 2007 తల్లిదండ్రులు వృద్ధుల పోషణ సంరక్షణ చట్టం 2011 నియమావళి అనుసరించి ఎంజీఎం లో అన్ని విభాగాలతో కూడిన ప్రత్యేక వార్డును వయోవృద్ధులకు ఏర్పాటు చేయవలసి ఉన్న ఇప్పటి వరకు ఎవరు పట్టించుకోలేదని అందుకు తమ వంతు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని సైనిక పాఠశాల 2014లో వరంగల్ కు మంజూరైన సైనిక పాఠశాల ప్రారంభమునకు చొరవ చూపాలని కోరారు. మరియు గోపాలపురం ప్రాంతంలో సబ్ పోస్ట్ ఆఫీస్ ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.సీనియర్ సిటిజన్స్ సమస్యల పట్ల వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య సానుకూలంగా స్పందించారు. త్వరలోనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి తేరాల యుగంధర్, జిల్లా కమిటీ సభ్యులు శ్రీ మార్కా రవీందర్ గౌడ్, సంయుక్త కార్యదర్శి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

# బీజేవైఎం ఆద్వర్యంలో తిరంగా ర్యాలీ

తరంగాలు/తొర్రూరు

78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బీజేపీ జాతీయ పార్టీ పిలుపు మేరకు ఈనెల 12నుండి15 వరకు హర్ ఘర్ తిరంగా అభియాన్ లో భాగంగా ఈ రోజు తొర్రూరు పట్టణంలో బీజేవైఎం తొర్రూరు అర్బన్ అధ్యక్షుడు శీలం శ్రీనాథ్ ఆద్వర్యంలో 500మందితో తిరంగా ర్యాలీ నిర్వహించడం జరిగింది.స్థానిక బస్టాండ్ సెంటర్ నుండి వివేకానంద సెంటర్ వరకు జాతీయ జెండాలు చేతబూని భారత్ మాతాకీ జై, వందేమాతరం అంటూ భారీ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా బీజేవైఎం మానుకోట జిల్లా ప్రధాన కార్యదర్శి కాగు నవీన్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ గారు ధేశ ప్రజల హృదయాలలో దేశభక్తిని మరోసారి తట్టిలేపుతూ హర్ ఘర్ తిరంగా అభియాన్ ద్వారా ప్రతీ పౌరుడు తమ ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని పిలుపునిచ్చారు అని,దీనిలో భాగంగానే ఈ రోజు దేశవ్యాప్తంగా యువ మోర్చా కార్యకర్తలు లక్షలాదిగా తరలి వచ్చి పెద్ద ఎత్తున తిరంగా ర్యాలీ నిర్వహించడం జరుగుతుంది అని తెలిపారు.భరతమాత దాస్య శృంఖలాలను




తెంచడం కోసం అనేక మంది ధేశ భక్తులు తమ ప్రాణాలను తృణ ప్రాయంగా అర్పించారని వారి త్యాగాలను స్మరించుకుంటూ, రాబోయే తరాలకు నాటి స్వాతంత్ర్య సమర యోధుల పోరాటం,వీర యోధుల చరిత్ర ను తెలియజేసి వారిలో ఈధేశం, సంస్కృతి పట్ల,ధర్మం పట్ల గౌరవం పెంపొందించే విధంగా ఈ తిరంగా ర్యాలీలు చేపట్టామని తెలిపారు.ప్రతీ ఒక్కరూ తమ ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి తమ ధేశ భక్తిని చాటుకోవాలని తెలిపారు.ఈర్యాలీలో బీజేవైఎం కాలేజీ అవుట్ రీచ్ జిల్లా కన్వీనర్ నూకల నవీన్, మీడియా కో కన్వీనర్ చెన్నబోయిన రాజు,బీజేపీ,రాష్ట్ర, జిల్లా, మండల, శక్తి కేంద్రం ఇంచార్జీలు, మరియు వివిధ మోర్చాల బాధ్యులు, బూత్ కమిటీ అధ్యక్షులు పల్లె కుమార్,అలిసేరి రవిబాబు, కస్తూరి పులేందర్, పైండ్ల రాజేష్, మంగళపల్లి యాకయ్య,గట్టు రాంబాబు,గట్ల భరత్, జలగం రవి,గంధం రాజు, నడిగడ్డ సందీప్, విష్ణ ,సిహెచ్.విజయ్ కుమార్, కుమ్మరికుంట్ల శివ,తాటి జగదీష్,సిద్దు,భూక్యా నాగేష్,బబ్లూ, సతీష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రీవెన్స్ ఫిర్యాదుల పరిష్కారం లో వేగం పెంచండి

**-బల్దియా కమీషనర్ అశ్విని తానాజీ వాకడే**

**-ప్రజల నుండి వినతుల స్వీకరణ.**



వరంగల్ జిల్లా బ్యూరో తరంగాలు

గ్రీవెన్స్ ఫిర్యాదుల పరిష్కారం లో వేగం పెంచాలని బల్దియా కమీషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు.సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని పురస్కరించుకొని బల్దియా ప్రదాన కార్యాలయం లోని కౌన్సిల్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో కమీషనర్ పాల్గొని ప్రజల నుండి వినతులు స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు.ఈ సందర్భంగా స్వీకరించిన ఫిర్యాదుల వివరాలు విభాగాల వారిగా 1.ఇంజనీరింగ్....18 2.హెల్త్&సానిటేషన్14 3.ప్రాపర్టీ టాక్స్(రెవెన్యూ)...10 4.టౌన్ ప్లానింగ్....54 5.డి ఆర్ ఎఫ్......01మొత్తం = 97ఇట్టి కార్యక్రమం లో ఎస్ ఈ లు ప్రవీణ్ చంద్ర రాజయ్య సి ఎం హెచ్ ఓ డా.రాజేశ్ బయలజిస్ట్ మాధవరెడ్డి హెచ్ ఓ రమేష్ డి ఎఫ్ ఓ శంకర్ లింగం టి పి ఆర్ ఓ కోలా రాజేష్ కుమార్ గౌడ్ డి సి పి రవీంద్ర డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి టి ఓ బిర్రు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు .

## ఎంహెచ్ నగర్ గుడిసె వాసులకు జిడబ్ల్యుఎంసి ఎఫ్ టిఎల్ నోటిసులు రద్దు చేయాలని కాలనీ వాసులు ధర్నా






తరంగాలు/వరంగల్ జిల్లా ప్రతినిధి:

గ్రేటర్ వరంగల్ పోచమ్మ మైదాన్ 13వ డివిజన్ ఎంహెచ్ నగర్ (దేశాయిపేట) లో గత 21 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ కులాలకు చెందిన వారు, ఈ కాలనీలో దినసరి కూలీ పనులు మేస్త్రీ, బిల్డింగ్ లేబర్, తట్టపని,ఆటో డ్రైవర్ గా, రిక్షా కార్మికులగా పనచేసుకుంటు జీవనం గడుపుతున్నారు,ఎంహెచ్ నగర్ కాలనీలో 650 కుటుంబాలు 2003 ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 308లో గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారు 2007 సంవత్సరంలో అధికార కాంగ్రెస్ పార్టీ స్థానిక ఎమ్మెల్యే బస్వరాజు సారయ్య మరియు వరంగల్ తహసీల్దార్(ఎంఆర్వో) చంద్రశేఖర్ హయాంలో బిపిఎల్ క్రింద ఇందిరమ్మ ఇండ్ల స్థలాల పట్టాలు మంజూరు చేసి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సోమవారం వరంగల్ మున్సిపాలిటీ కమిషనర్ కు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సింగారపు బాబు మరియు సిపిఎం కాశీబుగ్గ ఏరియా కార్యదర్శి మమ్మద్ బషీర్ అహ్మద్ కాలనీవాసులతో కలిసి మెమోరాండం సమర్పించడం జరిగింది ఈ సందర్భంగా సింగారపు బాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం తరుపున ఇందిరమ్మ ఇల్లు బిల్లులు పక్కా ఇండ్లు మంజూరు చేసి ఇచ్చారు దాంతో స్థిరనివాసం ఏర్పరచుకొని గత 21 సంవత్సరాలుగా ఆ కాలనీలో నివసిస్తున్నామని తెలిపారు,ఆ యొక్క కాలనీ లో ప్రభుత్వం నుంచి మరుగుదొడ్లు,సిసి రోడ్లు డ్రైనేజీ కాలువలు మిషన్ భగీరథ నీరు నల్లా కనెక్షన్లు వీధిలైట్లు కరెంటు స్తంభాలు చిన్నల పిల్లల పార్కులు అనేక రకాల సౌకర్యాలు కల్పించారు అయిన కొన్ని సంవత్సరాల పాటు నివసిస్తున్న మాకు నోటీసులు పంపించడం సమంజసం కాదని ఎద్దేవా చేశారు అనంతరం మహమ్మద్ బషిర్ మాట్లాడుతూ ఎన్నో ప్రభుత్వాలు వస్తున్నాయి. పోతున్నాయి కానీ ఇంతవరకు ఎవరు మాకు నోటీసులు ఇవ్వలేదు కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో కాలనీవాసులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు మహిళ సంయుక్త సంఘాలు డ్వాక్రా మహిళలకు గ్రూపులు ఏర్పాటు చేశారు నగర మున్సిపాలిటీల్లో కరెంట్ బిల్లు నల్ల బిల్లు ఇంటి పన్నులు అధికారులు వసూలు చేస్తున్నారు కాలనీలో అందరూ సక్రమంగా అన్ని ప్రభుత్వానికి పన్నులు కట్టేస్తున్నమని కానీ గత కొన్ని రోజుల క్రితం వరంగల్ నగర మున్సిపాలిటీ నుండి చిన్నవడ్డేపల్లి చెరువు ఎఫ్ టి ఎల్ పరిధిలో ఉన్నారంటూ నోటీసులు జారీ చేశారు దీంతో మాకు రెక్కల అమ్ముకొని బ్రతికే దీనస్థితిలో ఉన్న కాలనీవాసులు నిరుపేదలమైన మేము మా గుండెల్లో గుదిబండ పడ్డటైయిందని కాలనీ వాసులు భయభ్రాంతులకు గురై నానా ఇబ్బందులు పడుతున్నారని 21 సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో నివసిస్తున్న మేము మాకు ఆస్తులు ఏమీ లేవు కాబట్టి ఈ యొక్క నోటీసులను వెనక్కి తీసుకోవాలని కాలనీవాసులు వేడుకుంటున్నారు ఈ కార్యక్రమంలో తాళ్ల పెల్లి స్వామి దామెర రమేష్ దార రమాదేవి దార కుమారస్వామి దామెర మైబు జి ప్రభాకర్ ఏ నవీన్,టి, నర్సింగరావు,యం లింగయ్య (ఇస్సాకు) ఎండి అస్లాం పాషా,ఎండి గౌస్,కే అశోక్,ఎండి అక్బర్,ఏం సంతోష్,మొగిలి,కిరణ్,దాసు తదితరులు పాల్గొన్నారు.

MOVIES TIME



తరంగాలు

## విహార యాత్రలో 57వ డివిజన్ టీ జంక్షన్ కాలనీవాసులు

**తరంగాలు /హన్మకొండ ప్రతినిధి**

ఉరుకుల పరుగుల ప్రపంచంలో ఒక వ్యక్తి ఇంకొక వ్యక్తి తో మాట్లాడడమే కరువైందని,విహార యాత్రలతో మనసులోని బాధను,సంతోషాన్ని ఇతరులతో పంచుకోవచ్చని డి జంక్షన్ అధ్యక్షులు గడ్డం నరసయ్య అన్నారు.శ్రావణ మాసం కావడంతో గ్రేటర్ వరంగల్ 57వ డివిజన్ గోకుల్ నగర్ లోని టీ జంక్షన్ కాలనీవాసులు విహార యాత్రలో భాగంగా ముందుగా గట్టమ్మ తల్లిని దర్శించుకున్నారు. అనంతరం మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి ఆలయం, వాజేడు లోని బోగత వాటర్ ఫాల్స్ ను సందర్శించారు.ట్రావెల్ బస్సులోని పిల్లలు,పెద్దలు అందరూ కలిసి డ్యాన్సులతో అలరించారు. బొగత జలపాతాలను పెద్దలు చిన్నారులు అందరూ కలిసి తిలకించారు.ఈ సందర్భంగా టి జంక్షన్ అధ్యక్షులు గడ్డం నరసయ్య మాట్లాడుతూ టీ జంక్షన్ సంఘం ఏర్పాటు చేసి సంవత్సరం పూర్తయిన సందర్భంగా, అదేవిధంగా శ్రావణమాసం పురస్కరించుకొని వంటలకు వెళ్ళామని తెలిపారు.విహార యాత్రలో భాగంగా అందరితో కలిసి ఆనంద ఉత్సహాల నడుమ గడుపామని అన్నారు. టీ జంక్షన్ ఉపాధ్యక్షుడు పరికిరాల లింగయ్య మాట్లాడుతూ విహార యాత్రకు రావడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. టీ జంక్షన్ సంఘంలో ఇంకా ముందుకు తీసుకెళ్తామని ప్రతి సంవత్సరం విహార యాత్ర ఉంటుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో టీ జంక్షన్ అధ్యక్షుడు తో పాటు ఉపాధ్యక్షుడు పనికిరాల లింగయ్య,ప్రధాన కార్యదర్శి అందే గణేష్,సహాయ కార్యదర్శి గరిగే రవికుమార్,ఆడెపు భాస్కర్,పులి రంజిత్,సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల భద్రతే మా మొదటి ప్రాధాన్యత

**-నూతన చట్టాల గురించి అవగాహన**

**- సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ విద్యార్థి దశ నుండి ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవాలి.**

**- ఏ సమస్య ఉన్నా నిర్భయంగా ఫిర్యాదు చేయండి.**

**జిల్లా అడిషనల్ ఎస్పీ చెన్నయ్య**



**తరంగాలు -మహబూబాబాద్ :**

మహబూబాబాద్ జిల్లాలో మహిళల భద్రతే తమ మొదటి ప్రాధాన్యత అని జిల్లా అడిషనల్ ఎస్పీ చెన్నయ్య అన్నారు.మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఐపీస్ ఆదేశానుసారంగా మహిళల, విద్యార్థినిల భద్రతకు సంబంధించి ఏ సమస్య ఉన్న నిర్భయంగా షీ టీం ను లేదా పోలీసులను సంప్రదించాలని ఆయన సూచించారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ అప్డేటెడ్ జూనియర్ కాలేజ్ అండ్ స్కూల్ లో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో విద్యార్థులకు మహిళా రక్షణ షీ టీమ్స్ , ఈవ్ టీజింగ్, సైబర్ క్రైమ్స్, భరోసా, హ్యూమన్ ట్రాఫికింగ్ ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య మాట్లాడుతూ, విద్యార్థిని ,విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ, ఉన్నత లక్ష్యాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మహిళలు చిన్నపిల్లల రక్షణ విషయంలో పోలీస్ శాఖ పటిష్టమైన చర్యలు చేపట్టడం జరిగిందని,ఆకతాయిల వేధింపుల నుండి మహిళల రక్షణకు పోలీస్ శాఖ అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. జిల్లావ్యాప్తంగా షీ టీమ్స్ ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులకు, మహిళలకు అవగాహన కల్పిస్తూ నిరంతరం వారికి అందుబాటులో ఉంటాయని సూచించారు. మహిళలను, యువతులను వేధింపులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని మైనర్ బాలికలపై ఎవరైనా అఘాయిత్యాలకు పాల్పడితే ఫోక్సో యాక్ట్ కింద కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. మహిళలు యువతలు ఎలాంటి సమస్య ఉన్న నిర్భయంగా షీ టీమ్స్ లేదా పోలీసు వారిని సంప్రదించాలని కోరారు. వేధింపులపై నేరుగా సంప్రదించలేనివారు షి టీం నెంబర్ 8712656935 ,7901142009 కు లేదా డయల్ 100 కు సమాచారం అందించాలని సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. విద్యార్థినీ విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, ప్రస్తుతం మహిళలపై వేధింపులు అగైత్యాలు, ఆర్థిక నేరాలు సోషల్ మీడియా వేదికగా ఎక్కువగా జరుగుతున్నాయి అన్నారు. విద్యార్థులు విద్యార్థి దశ నుండే ఉన్నత లక్ష్యాలు ఏర్పాటు చేసుకుని క్రమశిక్షణ పట్టుదల ఓపికతో కష్టపడితే గొప్ప విజయాలు సాధ్యమవుతాయని ఆయన అన్నారు. చదువుకునే యుక్త వయసులో యువత ప్రలోభాలకు ,ఆకర్షణలకు గురై భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పులు చేసే ముందు మీ తల్లిదండ్రులకు కష్టాలను గుర్తు తెచ్చుకోవాలని కోరారు. తల్లిదండ్రులను అర్థం చేసుకొని గౌరవిస్తూ వారి యొక్క కలలను నెరవేరుస్తూ,ఉన్నత స్థాయిలో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ టౌన్ డిఎస్పి తిరుపతి ,మహబూబాబాద్ రూరల్ సిఐ సర్వయ్య ,షీ టీం ఎస్ఐ సునంద , మరియు షీ టీం సిబ్బంది, భరోసా టీం జయశ్రీ, పోలీస్ కళాజాత బృందం, మరియు ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ అప్డేటెడ్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ సుజాత మేడం మరియు వారి యొక్క అధ్యాపక బృందం, మరియు విద్యార్థిని విద్యార్థులు, గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ కేసముద్రం విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను సందర్శించిన







**-వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**

**తరంగాలు ప్రతినిధి /వర్ధన్నపేట:**

వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలోని కస్తూరి గాంధీ బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలను తొలుత విద్యార్థినీలు ఎమ్మెల్యే గారికి బొకే ఇచ్చి స్వాగతం పలికిన అనంతరం పాఠశాల పరిసర ప్రాంతాలను వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు సందర్శించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో పాఠశాలను పట్టించుకోకుండా పూర్తిగా అద్వానంగా మారి దుర్వాసన వస్తుండడంతో పిల్లలు ఆరోగ్యానికి గురితున్నారని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కి పాఠశాల సిబ్బందికి తెలియజేయడం జరిగింది.అనంతరం ఎమ్మెల్యే పాఠశాల ఆవరణం లోకి వెళ్లి వంటశాలను, బాలికలకు పెట్టే బొజనం నాణ్యతగా ఉండా లేదా అని పరిశీలించి బాలికలను అడిగి తెలుసుకోన్న అనంతరం పాఠశాల తరగతి గదులను పరిశీలించారు. మౌలిక సదుపాయాలు సరిగా లేక ఇబ్బంది పడుతుండగా సంబంధిత అధికారులతో మాట్లాడి మరమ్మత్తులు చేపిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.వాటర్ ప్లాంట్, తరగతి గదిలో తలుపులు కిటికీలు సరిగా లేనందున కొంతమంది నాయకులు చిన్న చిన్న మరమ్మత్తులు మేము చేపిస్తామని ముందుకు వచ్చా రు.తరగతి గదిలోకి వెళ్లి బాలికలతో మాట్లాడే పాఠశాల ఉపాధ్యాయులు సరిగా చెప్తున్నారా లేదా ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని వారితో మాట్లాడి బాగా చదువుకొని పాఠశాలకు మరియు ఉపాధ్యాయులకు మీ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకుని రావాలని ఎమ్మెల్యే సూచించారు.అనంతరం జూనియర్ కాలేజ్ పరిసర ప్రాంతాలను పరిశీలించి ప్రహరీ గోడ మరియు చిన్న చిన్న సమస్యలు ఉన్నాయని ఉపాధ్యాయులు విద్యార్థినీలు ఎమ్మెల్యేకి తెలియజేయడంతో వారు సంబంధిత అధికారులతో మాట్లాడి సానుకూలంగా స్పందించి త్వరితగతన పనులు పూర్తి చేపిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య, జిల్లా నాయకులు పోశాల వెంకన్న గౌడ్,మాజీ జెడ్పిటిసి కమ్మగొని ప్రభాకర్ గౌడ్, శ్రీపాద సతీష్, యాదగిరి, మరుపట్ల సాయికుమార్, అక్బర్, కొండేటి బాలకృష్ణ పాటు కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల బ్లాక్, గ్రామ స్థాయి నాయకులు వివిధ అనుబంధ సంఘాల నాయకులు, ఎంపీడీవోవెంకటరమణ , గ్రామ పంచాయతీ కార్యదర్శి రామారావు , పాఠశాల ఎస్ ఓ కరుణశ్రీ,ఉపాధ్యాయుల బృందం, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## రాజ్యాంగ రక్షణకు యువతరం నడుంబిగించాలి






**-మతోన్మాద శక్తుల నుండి రాజ్యాంగానికి పొంచి ఉన్న ప్రమాదం**

**-కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు**

**తరంగాలు న్యూస్/మహబూబాబాద్ :**

భారతదేశ ప్రజలందరి గుండెకాయ లాంటి భారత రాజ్యాంగానికి మతోన్మాద శక్తుల నుంచి ప్రమాదం పొంచి ఉందని, ఆ రాజ్యాంగమే దేశ సమఖ్యత సమగ్రతలను నిలబెడుతుందని ఆ రాజ్యాంగ రక్షణకు యువతరం నడుం బిగించాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ స్కైలాబ్ బాబు పిలుపునిచ్చారు. సోమవారం మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథం భవనంలో 77 ఏళ్ల స్వాతంత్రం రాజ్యాంగం ఎదుర్కొంటున్న సవాళ్లు అనే అంశంపై కెవిపిఎస్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సెమినార్ నిర్వహించారు. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డేల రామ్మూర్తి అధ్యక్షత వహించగా ప్రధాన వక్తగా హాజరైన కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తప్పెట్ల స్కైలాబ్ బాబు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 110 దేశాల రాజ్యాంగాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి విభిన్న వైవిధ్యాలు కలిగిన దేశంలో దేశ ప్రజలందరినీ ఒకే తాటిపైన నిలబెట్టడానికి, కులం మతం భాషా ప్రాంతం అతీతంగా ప్రజలందరికీ సమాన హక్కులు ఉండే విధంగా భారత రాజ్యాంగాన్ని రూపొందించారని ఆయన చెప్పారు. ప్రాచీన మనువాద సంస్కృతి సైదాంతిక భూమిక కలిగి ఉన్న ఆర్ఎస్ఎస్ కనుసనల్లోని బిజెపి ఆ రాజ్యాంగాన్ని రద్దు చేయడానికి అంబేద్కర్ ఆలోచనలను తుద ముట్టించటానికి కుట్రలు కుతంత్రాలు చేస్తుందని సామాజిక శక్తులు అడ్డుకోవాలని ఆయన పిలుపునిచ్చారు .చట్టం ముందు అందరూ సమానులేనని భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 14 పేర్కొంటుందని చెప్పారు భారత రాజ్యాంగం భారతీయులందరికీ అర్థమయ్యే రోజు రావాలన్నారు కేవలం న్యాయ శాస్త్ర విద్యార్థులు న్యాయవాదులకు మాత్రమే రాజ్యాంగం అర్థం కావడం ద్వారా దేశ ప్రజలందరూ మత చాందస మూఢవిశ్వాసాల మాటల జీవించాల్సి వస్తుందన్నారు మత రాజ్యాలన్నీ చీకటి రాజ్యాలు అయితే భారత రాజ్యాంగం సర్వసత్తాక గణతంత్ర సామ్యవాద సోషలిస్టు భావాలను సంతరించుకుందని చెప్పారు నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకొస్తున్న ఆర్ఎస్ఎస్ బిజెపి అట్టడుగు వర్గాల హక్కులను కాలరాస్తుందన్నారు ప్రశ్నిస్తే నేరంగా భావిస్తున్న రోజులని ప్రశ్నించిన మేధావులైన దబెల్కర్ ఫన్సారే కల్బుర్గి గౌరీ లంకేష్ వంటి మేధావులను 10 ఏళ్ల కాలంలో సంగుపరివార శక్తులు పొట్టలు పెట్టుకున్నాయని చెప్పారు మతాన్ని దేవుని రాజకీయాలతో నిలితం చేస్తూ మత విద్వేషాలను రెచ్చగొట్టడం ద్వారా బిజెపి ఎంఐఎం పబ్బం గడుపుకుంటున్నాయని తద్వారా ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్నాయని విమర్శించారు దేశ సమైక్యత సమగ్రతల కోసం లౌకిక విలువల కోసం నేటి యువతరం కట్టుబడి ఉండాలని ఆయన పిలుపునిచ్చారు రాజ్యాంగం మౌలిక పునాదులుగా ఉన్న ప్రజాస్వామ్యం ఫెడరలిజం సామాజిక న్యాయం లౌకికత్వం నాలుగు మూల స్తంభాలను కాపాడుకోవాలని అన్నారు చరిత్ర పాఠ్యాంశాలలో భగత్ సింగ్ అంబేద్కర్ వంటి మహనీయుల చరిత్రలను చెడిపేసే విధంగా ఎన్సీఈఆర్టీ నుంచి తొలగిస్తుందన్నారు ప్రస్తుత దేశానికి మతోన్మాద గండం పొంచి ఉందని రాజ్యసభ స్థానాలలో రిజర్వేషన్ల తో పాటు ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని తద్వారా సామాజిక న్యాయానికి బాట వేయాలని కోరారు ఎస్సీలలో క్రిమిలేయర్ పెట్టాలనే వాదనను ఆయన తిప్పి కొట్టారు అట్టడుగు తరగతుల అభివృద్ధి ఉత్పత్తి శక్తుల శ్రమ సంస్కృతికి విద్యార్థి యువతరం కట్టుబడి ఉండాలని శ్రమను గౌరవించడమే దేశభక్తి అని ఆయన పిలుపునిచ్చారు అసమానతల సమాజాన్ని అంతం చేయడం ద్వారా రాజ్యాంగ యొక్క ఉన్నత్యాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు ఈ సెమినార్ లో కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డేల రామ్మూర్తి జిల్లా ఉపాధ్యక్షులు చీపిరి యాకయ్య కెవిపిఎస్ జిల్లా నాయకులు దొనక దర్గయ్య ,హేమానాయక్ బూర్గుల లక్ష్మణ్ పులిపాక నాగరాజు బెజ్జం ఐలేస్,షేక్ ఖాదర్ బాబా, చెపురి గణేష్ శేషం ప్రశాంత్ పోలేపాక వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

Printed,Published by,Owened by **GADDAM NAGARAJU &** Printed at ,arun publication ,HNO 51/1 indhiramma colony,phase 1,nizampet, Hyderabad **RNI. NO TELTEL/2022/83463 &** Published at .HNO 3-123shivanagar colony,Ellanda, Wardhannapet, warangal 506313.. telangana
**EDITOR : GADDAM NAGARAJU . CELL :9494923460 . Website : WWW.tharangalu.com Email : nagarajugaddam009@gmail.com**